




# విజయభాను

విశాఖపట్నం, గురువారం 19-03-2020 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 165 పేజీలు : 8 వెల : 1 రూపాయి







### ప్రభుత్వానికి సిట్ బృందం

## రిపోర్టు అందజేత

- 30 ఎన్.ఓ.సి.లు కేసులు
- 20 ప్రభుత్వ భూ కేటాయింపు కేసులు
- సిట్ బృందం అధ్యక్షుడు డా. విజయ్ కుమార్



విశాఖపట్నం : భూ ఆక్రమణలపై ప్రభుత్వం నియమించిన సిట్ దర్యాప్తు బృందం మధ్యంతర రిపోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసినట్లు దర్యాప్తు బృందం అధ్యక్షుడు డా. విజయ్ కుమార్ వెల్లడించారు. బుధవారం సర్క్యూట్ హౌస్‌లో విలేఖరుల సమావేశంలో ఆయన తరువాయి 2లో..



### ఎన్నికల కమిషనర్‌దే

## తుది నిర్ణయం

- ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎత్తివేయాలి
- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగనివ్వండి
- త్రిసభ్య ధర్మాసనం విచారణ ఫలితం..
- సుప్రీం కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు ఆక్షేపించింది. తదుపరి స్థానిక ఎన్నికల తేదీలు ఖరారు చేసేటప్పుడు రాష్ట్ర ఎన్నికల సంఘం తప్పనిసరిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలని స్పష్టం చేసింది. ఇప్పటికే ఎన్నికలను వాయిదా వేస్తూ నోటిఫికేషన్ జారీ చేసినందున.. ఎన్నికల నిర్వహణపై ఇప్పుడు జోక్యం చేసుకోలేమని.. అయితే ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తక్షణమే ఎత్తివేయాలని ఆదేశించింది. అదే విధంగా ఇదివరకే ప్రారంభించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎన్నికల సంఘం అడ్డుకోరాదని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వాయిదా వేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో సీజేఐ జస్టిస్ ఎస్.ఎ.బాబ్డే, జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఎన్నికల కమిషనర్ నిర్ణయంలో రాజకీయ కోణాలు ఉన్నాయంటూ ప్రభుత్వ తరపున అడిషనల్ సొలిటర్ జనరల్ కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. అదే విధంగా.. ఒకవైపున ఎన్నికల ప్రక్రియను నిరంతరాయంగా వాయిదా వేస్తూ.. మరోవైపు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కొనసాగిస్తారంటూ తన వాదనలు వినిపించారు. ఒకే సమయంలో ఈ రెండూ ఎలా చేయగలుగుతారు?.. ప్రభుత్వం, పాలన స్తంభించిపోవాలా?... ఇందులో రాజకీయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను, తీసుకుంటున్న చర్యలను ఎన్నికల కమిషనర్ తెలుసుకోలేదు.. రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించి కొనసాగిస్తోంది.. వీటిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తరువాయి 2లో..

## ఏపీలో విద్యాసంస్థల బంద్

### రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన

అమరావతి : ఏపీలో గురువారం నుంచి అన్ని విద్యాసంస్థలను మూసివేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కరోనాపై నియంత్రణ చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో గురువారం నుంచి అన్ని విద్యా సంస్థలు మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కరోనా వైరస్ నియంత్రణ చర్యల్లో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పాఠశాలలు, కోచింగ్ సెంటర్లు సహా అన్ని విద్యా సంస్థలను గురువారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు మూసివేయాలని నిర్ణయం తీసుకున్నారు. కరోనా నియంత్రణ తరువాయి 2లో..

## వదంతులు నమ్మొద్దు.. వాస్తవాలు ప్రచారం చేయండి

**మాస్కులు, శానిటైజర్ల కొరత లేదు .. ప్రధాన కేంద్రాల్లో ఐసోలేషన్ వార్డుల్ని ఏర్పాటు చేశాం**

**రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి**



అమరావతి: కోవిడ్-19 వైరస్ నియంత్రణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటూ.. నిరంతరం సమీక్షిస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి అన్నారు. కరోనా వైరస్ నిరోధక చర్యలపై వైద్య ఆరోగ్యశాఖ బుధవారం బులెటిన్ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లా నెల్లూరు జిల్లాలో కోవిడ్ -19 పాజిటివ్ బాధితుడు కోలుకుంటున్నాడని, 14 రోజులు పూర్తయ్యాక మళ్లీ శాంపిల్‌ను పరీక్షించి డిశ్చార్జ్ చేస్తామని వెల్లడించారు.

కాగా, కరోనా విజ ృంభిస్తున్న నేపథ్యలో సోషల్ మీడియాలో వచ్చే వదంతుల్ని నమ్మొద్దని, అవాస్తవాల్ని ప్రచారం చేస్తే కఠిన తరువాయి 2లో..

## అరకు రైలుకు మరిన్ని విస్టాడోమ్ కోచ్‌లు కావాలి

**– ఎంపీ విజయసాయి రెడ్డి విజ్ఞప్తి –**




న్యూఢిల్లీ : విశాఖపట్నం-అరకులోయ మధ్య నడిచే పర్యాటక రైలుకు అదనంగా ఐదు విస్టాడోమ్ కోచ్‌లను ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి రైల్వేమంత్రికి విజ్ఞప్తి చేశారు. రాజ్యసభలో బుధవారం ప్రత్యేక ప్రస్తావన (స్పెషల్ మెన్షన్) ద్వారా ఆయన ఈ అంశంపై మాట్లాడుతూ.. బీచ్‌లు, గుహలు, జలపాతాలు, ఘాట్‌లతో విశాఖపట్నం జిల్లా పర్యాటకుల స్వర్గధామంగా విరాజిల్లుతోందని అన్నారు. 'తూర్పు కోస్తాకు మణిహారంగా విశాఖ జిల్లా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతంలో పర్యాటకానికి విశేష ఆకర్షణగా నిలిచిన వాటిలో విస్టాడోమ్ కోచ్ ఒకటి. ప్రస్తుతం పర్యాటక రైలుగా పరిగణించే విశాఖపట్నం-అరకు లోయ రైలుకు అనుసంధానించిన ఈ విస్టాడోమ్ కోచ్‌లో ప్రయాణం పట్ల పర్యాటకులు అమితమైన ఆసక్తి చూపుతున్నారు?' ఆయన అన్నారు. తూర్పు కనుమల్లో విస్తరించిన సువిశాలమైన ఆకుపచ్చని అడవులు, లోయలు, టన్నెల్స్ వంటి ప్రక ృతి ద ృశ్యాలను పర్యాటకులు నిలువెత్తు అద్దాల గుండా నలుదిక్కులా వీక్షించే విధంగా ప్రత్యేకంగా డిజైన్ చేసిన విస్టాడోమ్ కోచ్ తరువాయి 2లో..

### గ్రామాల ఆర్థిక వ్యవస్థను

## బలోపేతం చేయాలి

- బ్యాంకుల వడ్డీరేట్ల విషయంలో సానుకూలత కావాలి
- మానవతా దృక్పథంతో వ్యవహరించాలి
- 210వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి



అమరావతి: మహిళలకు వడ్డీ రేట్ల విషయంలో బ్యాంకర్లు మానవతా దృక్పథంతో ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కౌలు రైతులకు రుణాల మంజూరుకు బ్యాంకులు మరింత ముందుకురావాలని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఇస్తున్న రుణాలు ఆశాజనకంగా లేవని సీఎం జగన్ అన్నారు. సచివాలయంలో 210వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్.ఎల్.బీ.సీ) సమావేశానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సమావేశం సీఎం జగన్ మాట్లాడుతూ.. వైఎస్సార్ తరువాయి 2లో..

## మే 31లోపు ఉద్యోగులను విశాఖకు తీసుకువెళ్లాలి

### ప్రత్యేక పత్రాల ద్వారా అభిప్రాయ సేకరణ

### సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి



అమరావతి: విశాఖపట్నం వెళ్లేందుకు సచివాలయ ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారని ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం అధ్యకుడు వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగుల కీలక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల అవసరాలపై తరువాయి 2లో..






## వైకాపా అభివృద్ధి పథకాలు నచ్చే పార్టీలో చేరాం



**పార్టీని నమ్ముకున్న వారినే టీడీపీ దూరం చేస్తోంది**

**టీడీపీని వీడిన ఎమ్మెల్సీ శమంతకమణి, మాజీ ఎమ్మెల్యే యామినిబాల**

అమరావతి: జిల్లాలో తెలుగుదేశం పార్టీకి భారీ షాక్ తగిలింది. టీడీపీ ఎమ్మెల్సీ శమంతకమణి, ఆమె కూతురు మాజీ ఎమ్మెల్యే యామినీబాల బుధవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిని సాదరంగా పార్టీలోకి వైఎస్ జగన్ ఆహ్వానించారు. అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలో గట్టి పట్టున్న వీరిద్దరూ తమ అనుచరులతో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల వేళ టీడీపీకి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే పలువురు సీనియర్ నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఆ పార్టీ వీడిన సంగతి తెలిసిందే. టీడీపీలో శమంతకమణి సీనియర్ నేతగా ఉన్నారు. కాంగ్రెస్ నుంచి ఓసారి శింగనమల ఎమ్మెల్యే గా గెలిచారు. తర్వాత టీడీపీలో ముఖ్యనేతగా ఉన్నారు. 2019లో మాజీ ఎంపీ తరువాయి 2లో..

## అదనపు భవనాలు పూర్తి చేయాలి

మాకవరపాలెం : అదనపు భవనాలను త్వరగా పూర్తి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బూరుగుపాలెం, గిడుతూరు, జి.కోడూరు ఉన్నత పాఠశాలలకు రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఏ) నుంచి నాలుగేళ్ల క్రితం ఆరు గదుల చొప్పున మంజూరయ్యాయి. ఇందులో జి.కోడూరు, గిడుతూరు భవన నిర్మాణం, మూడేళ్ల పాటు సాగింది. గత ఏడాది వేసవి సెలవులకు ముందు ప్రారంభమయ్యాయి. ఇక బూరుగుపాలెంలో మొదటి బేస్‌మెంట్‌తో పిల్లర్లను వేసి వదిలేశారు. నాలుగేళ్ల నుంచి ఇందులో విద్యార్థుల సైకిళ్లు పెట్టుకునేందుకు వినియోగిస్తున్నారు. ఇక్కడ నాలుగు తరగతులు వరండాలు, నేలపైనే సాగుతున్నాయి. అయినా ఈ భవనం పనులు చేపట్టకపోవడంతో ఈ ఏడాది కూడా విద్యార్థులకు కష్టాలు తప్పవని వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వచ్చే విద్యా సంవత్సరం నాటికైనా ఈ అదనపు భవనాలను పూర్తి చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ప్రచారం ఖర్చుల వివరాలు సమర్పిస్తున్న అభ్యర్థులు

గొలుగొండ : ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ నిలిచినా అభ్యర్థుల తమ ఖర్చుల వివరాలు తెలియజేయాలని మండల పరిషత్ కార్యాలయం నుంచి వచ్చిన సమాచారం మేరకు అభ్యర్థులు తమ ప్రచారాల ఖర్చుల వివరాలను సమర్పిస్తున్నారు. మండలంలో జెడ్పీటీసీకి ఏడుగురు, 15 ఎంపిటిసి సెగ్మెంట్లకు 38 మందిపోటీలో ఉన్న పోటీలో ఉన్న సంగతి తెలిసిందే. ఎన్నికల ఖర్చులు తెలుసుకునేందుకు నియమించిన తహశీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సుధావాణి ఖర్చుల వివరాలు అందించాలని అభ్యర్థులకు ఖర్చులు ఎటువంటివి లేవని సమాచారం అందించారు.

## అవగాహనతో కరోనా దూరం

నాతవరం : అవగాహనతో కరోనాను దూరం చేసుకోవచ్చునని వైద్యాధికారి ప్రసన్న పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ముఖ్యంగా విదేశాల నుంచి గ్రామాలకు వస్తున్న వారి విషయంలో వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. వైరస్ ప్రభావం వారికి గాని వారి నుంచి ఇతరులకు రాకుండా ముందస్తు చర్యలు తీసుకునేందుకు దోహదపడుతుందన్నారు. బుధవారం నుంచి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఓటర్ల జాబితా సిద్ధం

కోటవురట్ల : మండలంలో పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సచివాలయ సహాయకులు 56 పోలింగ్ కేంద్రాలకు కావలసిన పత్రాలతో పాటు బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల వాయిదా వేసినా అవసరమైన వాటిని ముందుగానే పంచాయతీల వారీగా సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

## రాజకీయ కోణం బట్టబయలైంది : అంబటి



తాడేపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలను నిలిపివేయడంలో ఎలక్షన్ కమిషన్ తన పరిధిని దాటి వ్యవహరించిందని సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా తీర్పు చెప్పిందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు అన్నారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. కరోనా సాకుతో స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేశారని, దీంతో ఈసీ నిర్ణయంపై ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లిందన్నారు. ఎన్నికల వాయిదా రాజకీయ కోణంలో జరిగినట్లు బట్టబయలయిందన్నారు.

ఎన్నికలు వాయిదా వేస్తూ ఎన్నికల కోడ్ ఎలా కొనసాగిస్తారని ఆయన ప్రశ్నించారు. ఇది అతిక్రమణ, తప్పు అని ఈసీకి సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందని ఆయన గుర్తు చేశారు. ఎన్నికల కోడ్ ఎత్తి వేయాలని, సంక్షేమ పథకాల కొనసాగించవచ్చని సుప్రీంకోర్టు తీర్పు చెప్పడం మంచి పరిణామమని అంబటి రాంబాబు అన్నారు.

ఎన్నికలు నిర్వహించేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలని, సుప్రీంకోర్టు స్పష్టంగా తన తీర్పులో చెప్పిందని అంబటి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతోనే చారిత్రాత్మక తీర్పు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. కుట్ర పూరితంగా ఎన్నికల కమిషన్ వ్యవహరించిందని అంబటి మండిపడ్డారు. ప్రభుత్వాన్ని కొన్ని రోజుల పాటు స్తంభింప చేయాలనే కుట్ర చేశారని ఆయన ధ్వజమెత్తారు. సుప్రీంకోర్టు ప్రశ్నలపై ఈసీ సమాధానం చెప్పాలని అంబటి డిమాండ్ చేశారు. సాధ్యమైనంత తొందరగా ఎన్నికల నిర్వహణకు ఈసీ చర్యలు తీసుకోవాలన్నారు. ఎలక్షన్ కమిషన్ ఇప్పటికైనా ఆలోచన చేయాలని ఆయన సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికల వాయిదా వెనక చంద్రబాబు ఉన్నారని అంబటి మండిపడ్డారు. కేంద్ర ఎన్నికల కమిషన్‌లో ముగ్గురు సభ్యులు ఉంటారని, అదేవిధంగా ఎస్ఈసీలో కూడా ముగ్గురు సభ్యులు ఉండేలా సంస్కరణలు తేవాలన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు మొదటి నుంచి పెట్టాలని అడుగుతున్న చంద్రబాబు, అసెంబ్లీ ఎన్నికలు కూడా పెట్టమని అడుగుతారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు గొంతెమ్మ కోరికలు ఎన్నైనా కోరుతారని, బాబు అడిగేవన్ని జరగవని అంబటి అన్నారు. చట్టం, నిబంధనల ప్రకారం ఎన్నికలు జరుగుతాయని అంబటి రాంబాబు తెలిపారు.

## ఇళ్ల స్థలాల పంపిణీ ఆపాలని చూశారు

అమరావతి: న్యాయ వ్యవస్థపైన, అన్ని ప్రభుత్వ వ్యవస్థలపైన గౌరవం ఉన్న పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ అని మంత్రి శంకర్ నారాయణ అన్నారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. 14వ ఫైనాన్స్ కమిషన్ నుంచి రాష్ట్రానికి రావల్సిన నిధులు రాకపోతే ఆ పాపం మొత్తం చంద్రబాబుదే అని ఆయన మండిపడ్డారు. ఇళ్ల స్థలాలు అందించే పథకం ఒక శాశ్వత పథకమని ఆయన అన్నారు. ఎలక్షన్ కోడ్ రాకముందే ప్లాట్ల కేటాయింపు, ఇళ్ల స్థలాల ఎంపిక వంటి ప్రక్రియలు జరిగాయని ఆయన గుర్తు చేశారు.

చంద్రబాబు నాయుడు, ఎన్నికల కమిషనర్ దుర్బుద్ధితో ఇళ్ల స్థలాల పంపిణీని ఆపే ప్రయత్నం చేశారని శంకర్ నారాయణ దుయ్యబట్టారు. సుమారు 26 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించడం జరుగుతుందని, వారి సొంత ఇంటి కల నెరవేరుతుందని మంత్రి అన్నారు. విచక్షణ అధికారం అంటే సమాజానికి, ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగపడేలా ఉండాలని మంత్రి శంకర్‌నారాయణ అన్నారు. ఎలక్షన్ కమిషనర్ తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అయన మండిపడ్డారు. కరోన వైరస్ వ్యాప్తి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా లేని ఈ సమయంలోనే ఎన్నికలు నిర్వహించి ఉంటే సమస్య ఉండేది కాదన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా తాము స్థానిక సంస్థల్లో విజయం సాధిస్తామన్నారు. ప్రజల కష్టాలు తెలిసి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి ప్రజలకు చేరువగా ఉండే వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని శంకర్ నారాయణ కొనియాడారు.

మొదటి పేజీ తరువాయి

## ప్రభుత్వానికి సిట్ బృందం రిపోర్టు అందజేత

మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఎన్.ఓ.సి. కేసులు ఉన్నాయని, ప్రభుత్వ భూ కేటాయింపు కేసులు 20 ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. తహసిల్దార్లతో ఒక సమావేశం ఇప్పటికే ఏర్పాటు చేయడమైనదని ఒక వారం లేదా పది రోజులో రిపోర్టులు ఇస్తామని చెప్పినట్లు ఆయన తెలిపారు. సర్వేయర్లను వినియోగించుకొని త్వరితగతిన సబ్ డివిజన్ చేయాలని తహసిల్దార్లను ఆదేశించినట్లు ఆయన చెప్పారు. 1380 దరఖాస్తులను స్వీకరించగా ఇందులో 679 దరఖాస్తులు సంబంధిత తహసిల్దార్లకు పంపడమైనదని ఆయన వివరించారు. ఇప్పటి వరకు 420 రిపోర్టులు తహసిల్దార్ల నుండి వచ్చినట్లు ఆయన తెలిపారు. 1380 దరఖాస్తులలో 342 దరఖాస్తులను డిస్పోజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. విలేఖరుల సమావేశంలో సభ్యులు వై.వి. అనూరాధ, టి. భాస్కరరావు, కె. దుర్గానంద్ ప్రసాద్ రావు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో విద్యాసంస్థల బంద్

చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కాగా, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించినా ఏపీలో మాత్రం ఇవ్వలేదని, ప్రజల ఆరోగ్యంతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలలు మూసివేస్తున్నట్లు జగన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అలాగే, కరోనా తీవ్ర దృష్ట్యా స్థానిక సంస్థల ఎన్నికలను రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. అయితే ఏపీలో కరోనా తీవ్రత పెద్దగా లేదని, ఎన్నికలు యథావిధిగా నిర్వహించాలని జగన్ సర్కార్ వాదిస్తోంది. దీనిపై సుప్రీం కోర్టుకు సైతం వెళ్లింది. కానీ, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల వాయిదాను సుప్రీం కోర్టు సమర్థించింది. దీంతో ఎన్నికలు సైతం నిర్వహించే పరిస్థితి లేనందున విద్యాసంస్థలకు సెలవులు ప్రకటిస్తూ జగన్ సర్కార్ తాజాగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## ఎన్నికలను తక్షణమే వాయిదా వేయాలి

రాజకీయ దురుద్దేశంతో అడ్డుకుంటున్నారు.. సుప్రీంకోర్టును ఆశ్రయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రిట్ పిటిషన్ దాఖలు చేస్తే.. అదే సమయంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కెవియట్ పిటిషన్ దాఖలు చేశారు... ఎన్నికల కమిషనర్ ఒక పొలిటికల్ లైన్ ప్రకారం వెళ్లారని అర్థమవుతోంది.. ఎన్నికలను వాయిదా వేయడానికి అనుసరించాల్సిన పద్ధతిలో వెళ్లలేదు.. ఎన్నికలు నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం సర్వం సిద్ధమైన సమయంలో ప్రభుత్వాన్ని సంప్రదించకుండా ఎన్నికల కమిషనర్ నిర్ణయం తీసుకోవడం సరికాదు అని పేర్కొన్నారు. ఈ క్రమంలో ... తమ నిర్ణయంలో ఎలాంటి రాజకీయం లేదని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇందుకు స్పందించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బాబ్డే.. తప్పకుండా రాజకీయాలు ఉండకూడదు.. కానీ పరిస్థితి ఇంతవరకు ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో.. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక.. కోడ్ ఉంటుందని, ప్రవర్తనా నియమావళి ప్రకారం నడుచుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది మరోసారి వాదనలు వినిపించారు. దీంతో... ఒకవైపు ఎన్నికలను వాయిదా వేస్తామంటున్నారు.. ఇంకోవైపున ఎన్నికల ప్రవర్తనా నియమావళి కొనసాగిస్తామంటున్నారు. రెండు విధాలుగా ఎలా చేస్తారు అంటూ జస్టిస్ గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్తంభించిపోవాలని కోరుకుంటున్నారా అని ప్రశ్నించారు.

ఇందుకు స్పందనగా.. ఎన్నికల సంఘం ఒక లైన్ ప్రకారం వెళ్లిందని.. ప్రభుత్వం పనిచేయకుండా అడ్డుకోవాలన్న ఉద్దేశం కనిపిస్తోందని అడిషనల్ సొలిసిటర్ జనరల్ మరోసారి న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో.. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పట్టాల పంపిణీని హైకోర్టు నిలుపుదల చేసిందంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం న్యాయవాది సుప్రీంకోర్టును తప్పుదోవ పట్టించబోగా.. అడిషనల్ సొలిసిటర్ జనరల్ వెంటనే అడ్డుకున్నారు. ఇలా చేస్తే ఎన్నికల నిర్వహణలో పారదర్శకత ఉండదంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం న్యాయవాది వాదించబోగా.. ఒక పార్టీ రాజకీయ వైఖరికి అనుగుణంగా సదరు న్యాయవాది వ్యవహరిస్తున్నారంటూ మరోసారి అడిషనల్ సొలిసిటర్ జనరల్ తన వాదనలు వినిపించారు.

## వదంతులు నమ్మొద్దు..

చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా మాస్కులు, శానిటైజర్ల కొరత లేదని, దీనిపై ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. కోవిడ్ -19 వైరస్ అనుమానితుల సమాచారాన్ని కంట్రోల్ రూం నంబరు (0866-2410978)కి తెలియజేయాలని లేదా వెంటనే సమీప ప్రభుత్వాసుపత్రిని సంప్రదించాలని చెప్పారు. వైద్య సలహాల కోసం 104 టోల్ ఫ్రీ హెల్ప్ లైన్‌కు ఫోన్ చేయాలని, ఈ వైరస్ ప్రభావిత దేశాల నుండి రాష్ట్రానికొచ్చిన 856 మంది ప్రయాణికుల్ని గుర్తించామన్నారు. వారిలో 586 మంది ఇళ్లలోనే వైద్యల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మిగిలిన 250 మందికి 28 రోజుల పరిశీలన పూర్తయ్యిందని, 20 మంది ఆసుపత్రిలో వైద్యుల పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు.

విదేశాల నుండి వచ్చిన ప్రయాణీకులు
14 రోజులు ఇంట్లోనే ఉండాలి

ఇక 102 మంది నమూనాలను ల్యాబ్‌కు పంపగా 90 మందికి నెగటివ్ వచ్చిందని చెప్పారు. మరో 11 మంది శాంపిళ్లకు సంబంధించిన రిపోర్టులు రావాల్సి ఉందన్నారు. కోవిడ్-19 ప్రభావిత దేశాల నుండి వచ్చిన ప్రయాణికులకు వ్యాధి లక్షణాలున్నా, లేకపోయినా 14 రోజుల పాటు ఇళ్లల్లోనే ఉండాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో బయటికి వెళ్లకూడదన్నారు.

## గ్రామాల ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలి

నవోదయం పథకం కింది ఎంఎస్ఎంఈలకు, ప్రధానమంత్రి ముద్ర యోజన కింద ఇచ్చే రుణాలు, ఎస్సీ, ఎస్టీ, మహిళలకిచ్చే రుణాల శాతం చాలా తక్కువగా ఉందన్నారు. స్వయం సహాయక సంఘాల రుణాలపై కూడా దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా కేటగిరీ ఒకటిలో ఉన్న ఆరు జిల్లాల్లో ఒకలా, మిగిలిన ఏడు జిల్లాలో ఇంకోలా వడ్డీరేట్లు ఉన్నాయని సీఎం జగన్ తెలిపారు. బ్యాంకులు వసూలు

ఈ- పంటలో నమోదైన వివరాల ఆధారంగా సాగుచేస్తున్న పంటలకు తగినట్టుగా బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. అలాగే కౌలు రైతులు సాగుచేస్తున్న పంట వివరాలు అందుబాటులో ఉంటాయని, రెవెన్యూ అసిస్టెంట్లు ద్వారా కౌలు రైతు, యజమాని ఇద్దరూ అగ్రిమెంటు మీద సంతకం చేసి బ్యాంకు రుణం ఇస్తారని సీఎం జగన్ తెలిపారు.బ్యాంకులు వారికి ఉదారంగా రుణాలు ఇవ్వాలని, రైతులకు పండించిన పంటకు తగిన ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం జగన్ అన్నారు. ధర రాని పక్షంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని మార్కెట్లో పోటీని పెంచేలా, రైతులకు కనీస గిట్టుబాటు ధరలు వచ్చేలా చర్యలు తీసుకుంటుందని సీఎం జగన్ వివరించారు. మే 15న ఆర్బీకే ద్వారా రైతు భరోసా ఇవ్వబోతున్నామని, మైక్రోఎంటర్ ప్రె%జెస్ కోసం జూన్‌లో ఓ పథకాన్ని ప్రారంభించబోతున్నామని సీఎం జగన్ వెల్లడించారు.2019 వార్షిక రుణ ప్రణాళికలో నిర్దేశించుకున్న లక్ష్యం రూ. 2,29,200 కోట్లు కాగా, డిసెంబరు వరకూ రూ. 1,73,625 కోట్లు (75.75శాతం) ఇచ్చామని జె.పకీరసామి తెలిపారు. ఎంఎస్ఎంఈలకు రూ.36,000 వేల కోట్లు ఇవ్వాలని లక్ష్యం కాగా డిసెంబరు వరకూ రూ. 29, 442 కోట్లు (81.78శాతం)ఇచ్చామన్నారు.స్సీ, ఎస్టీ మహిళలకు స్టాండప్ ఇండియా కింద ఆర్థిక సహాయం చేయాలని లక్ష్యం చేసుకోగా డిసెంబరు వరకూ రూ. 4,857 మందికి సహాయం చేశామని ఆయన వెల్లడించారు.

ఈ సమావేశంలో సీఎం వైఎస్ జగన్, ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాద్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబుతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని, ఎస్.ఎస్.రావత్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఫైనాన్స్, కే వి నాంచారయ్య, కన్వీనర్, ఎస్ఎల్‌బీసీ, సీజీఎం (ఆంధ్రా బ్యాంకు), ఆర్బీఐ జనరల్ మేనేజర్ సుందరం శంకర్, నాబార్డ్ సీజీఎం ఎస్.సెల్వరాజ్ పాల్గొన్నారు.

## మే 31లోపు ఉద్యోగులను విశాఖకు తీసుకువెళ్లాలి

ప్రత్యేక పత్రాల ద్వారా అభిప్రాయ సేకరణ జరపాలని కోరారు. మే 31 లోపు ఉద్యోగులను విశాఖ తీసుకెళ్లాలని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు.

## అరకు రైలుకు మరిన్ని విస్టాడోమ్ కోచ్‌లు కావాలి

ప్రారంభించిన రోజు నుంచే పర్యాటకుల నుంచి విశేష ఆదరణ పొందుతున్నట్లు ఆయన చెప్పారు. అమిత ప్రజాదరణ పొందిన విస్టాడోమ్ కోచ్‌కు అనూహ్యమైన డిమాండ్ ఏర్పడినప్పటికీ రైలులో కేవలం ఒకే ఒక కోచ్ అందుబాటులో ఉండటం పర్యాటకులను తీవ్ర నిరాశకు గురిచేస్తోందని అన్నారు. 'విస్టాడోమ్ కోచ్‌లో ప్రయాణానికి టిక్కెట్ల కోసం ప్రతి రోజు సుదీర్ఘమైన వెయిటింగ్ లిస్ట్ ఉంటోంది. ఈ నేపథ్యంలో విశాఖపట్నం-అరకులోయ రైలుకు కనీసం మరో అయిదు విస్టాడోమ్ కోచ్‌లను సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేసి పర్యాటకుల అవసరాన్ని తీర్చాలి. అదనంగా ఏర్పాటు చేసే విస్టాడోమ్ కోచ్‌ల వలన విశాఖపట్నంలో పర్యాటక రంగానికి మరింత ఊపు ఇచ్చినట్లువుతుంది. అలాగే రైల్వేలకు కూడా దండిగా ఆదాయం లభిస్తుంది' అని విజయసాయిరెడ్డి అన్నారు. ఈ కారణాల ద ృష్ట్యా అరకు రైలుకు అదనంగా అయిదు విస్టాడోమ్ కోచ్‌ల ఏర్పాటు కోసం తగిన చర్యలు చేపట్టవలసిందిగా రైల్వే మంత్రికి ఆయన విజ్ఞప్తి చేశారు.

## వైకాపా అభివృద్ధి పథకాలు నచ్చే పార్టీలో చేరాం

జేసీ దివాకర్‌రెడ్డి, జిల్లా నేతల సలహాతో శింగనమల నియోజకవర్గ అభ్యర్థిని చంద్రబాబు మార్చేశారు. అప్పటిదాకా ఎమ్మెల్యేగా ఉన్న యామిని బాలకు బదులు కొత్తగా వచ్చిన బండారు శ్రావణికి అవకాశం కల్పించారు. తన కుమార్తెకు టికెట్ కోసం చివరి వరకు శమంతకమణి ప్రయత్నాలు చేశారు. నేరుగా చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేశారు. పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేసినా కొత్తగా వచ్చిన వారికి టికెట్లు ఇచ్చి పార్టీనే నమ్ముకున్న వారిని దూరం చేశారంటూ అప్పట్లో బహిరంగంగానే వాపోయినా ప్రయోజనం లేకపోయింది. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు వైఖరి పట్ల వారు అసంతృప్తిగా ఉన్న వారు.. దళితులను పక్కన పెడుతున్నారనే మనస్తాపంతో పార్టీని వీడినట్లు సమాచారం.

# వైసీపీ అభ్యర్థి వంశీరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలి !

### మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి చింతలపూడి వెంకట్రామయ్య

గాజువాక : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో జివిఎంసి 74 వ వార్డు నుండి వైసీపీ పార్టీ నుండి కార్పొరేటర్ గా పోటిచేస్తున్న యువ నాయకులు , స్నేహశీలి ఐనటువంటి తిప్పల వంశిరెడ్డిని ఏకగ్రీవంగా గెలిపించుకోవలసిన బాధ్యత మన వార్డు ప్రజలందరూ పైన ఉందని మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి అన్నారు. బుధవారం వార్డు పరిధి సిద్దేశ్వరం గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిధిలుగా పెందుర్తి, గాజువాక మాజీ ఎమ్మెల్యే లు తిప్పల గురుమూర్తి రెడ్డి , చింతలపూడి వెంకటరామయ్యా, వైసీపీ అభ్యర్థి తిప్పల వంశిరెడ్డిలు పాల్గొన్నారు . ఈ సందర్భంగా గురుమూర్తి రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరిగే గ్రేటర్ ఎన్నికలలో గాజువాక నియోజక వర్గంలో ఉన్న 20 వార్డులలో కూడా వైసీపీ విజయకేతనం ఎగరువేస్తుందని జోష్యం చెప్పేరు. నియోజకవర్గంలో ఉన్న 20 వార్డులలో ముఖ్యంగా 74 వ వార్డు కార్పరేటర్ అభ్యర్థి తిప్పల వంశిరెడ్డిని వార్డు ప్రజలంతా ఏకగ్రీవంగా ఎన్నుకుంటారనే నమ్మకం తనకి వుందన్నారు. చింతలపూడి వెంకట్రామయ్య మాట్లాడుతూ సిద్దేశ్వరం గ్రామ ప్రజలందరూ ఏకమై వంశిరెడ్డి గెలుపుకు పాటు పడడం ఆనందంగా ఉందని అన్నారు. ఒక్క సిద్దేశ్వరం గ్రామమే కాకుండా అన్ని గ్రామాల్లో వార్డు ప్రజలు మొత్తం ఒకటై వంశిరెడ్డిని అత్యంత భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్పరేటర్ అభ్యర్థి వంశిరెడ్డి మాట్లాడుతూ తన గెలుపుకోసం తన సోదరులు మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట రామయ్యలు తనని ఆశీర్వదించి తన గెలుపుకోసం ప్రచారాలలో పాల్గొన్నందుకు ధన్యవాదాలు తెలుపుతూ, పూర్తి స్థాయిలో సహాయ సహకరలందించడం చాలా ఆనందంగా ఉంద న్నారు. ముఖ్యంగా మొదటి నుండి సిద్దేశ్వరం గ్రామ ప్రజలు, యువత మా కుటుంబానికి వెన్నంటే ఉండడం తన అదృష్ట మన్నారు. తనని కార్పరేటర్ గా గెలిపిస్తే వార్డులో ఉన్న అన్ని సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించి వార్డు అభివ ృద్ధికి క ృషి చేస్తానని సిద్దేశ్వరం గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పూతి తాతా రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సత్తిరెడ్డి, తాతారావు, పిట్టా అప్పారావు, గొరుసు సత్యం, పెంటయ్య రెడ్డి, అప్పారావు, సత్యరావు, పిట్టా రెడ్డి, రాజు, ప్రసాద్ రెడ్డి, గురునాధ్, గ్రామ ప్రజలు, మహిళలు, పేద సంఖ్యలో యువత పాల్గొన్నారు.



# పేదలందరికీ పక్కా ఇళ్లు కోసం కృషి



గాజువాక: పేదలందరికి పక్కా ఇళ్ల ప్రభుత్వం అందించేల కోసం క ృషి చేస్తున్నట్లు వైకాపా నేత దామ సుబ్బారావు తెలిపారు. బుధవారం 86వ వార్డు రాజీవ్ నగర్‌కు చెందిన స్థానిక మహిళలు వైసీపీ అభ్యర్థి దామా సుబ్బరావుతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా పేద ప్రజలకు సిఎం జగన్ మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని దామా సుబ్బరావు అన్నారు. రాబోవు వేసవి కాలంలో 86వ వార్డులో నీటి ఎద్దడి నివారణ పై రాజీవ్ నగర్ ప్రజలకు బరోసా ఇచినట్లు దామా తెలిపారు. ప్రతీ ఇంటికి ట్యాంకర్ల ద్వారా త్రాగే నీరు అందిస్తాను దామా అన్నారు. అలాగే పేదలందర్కి పక్క ఇళ్ళు వచ్చేలా క ృషి చేస్తాను అని అన్నారు. గాజువాక రియల్ హిరో తిప్పల నాగిరెడ్డి 86వ వార్డుకి సంబందించి కమ్యూనిటి హాల్ నిర్మాణం అనుమతులు మంజూరి చేయించారు అని వాటి నిర్మాణం వార్డులో ఏడు చోట్ల త్వరలో మొదలు పెడతాం అని దామా సుబ్బరావు అన్నారు.

వాలంటీరిల ద్వారా సంక్షేమ పథకాలు వార్డులో ప్రతి ఒక్కర్కి చేరేలా చర్యలు తీసుకుంటానని దామా తెల్పిపారు. అలాగే వార్డులో ఏ ఒక్కర్కి ఎటువంటి సమస్య వచ్చిన నేరుగా అర్ధరాత్రి అయిన తన ఇంటికి వచ్చి తలుపు కొట్టవచ్చు అని అందుబాటులో ఉంటాను అని దామా హామీచ్చారు. కార్యక్రమంలో మెడికల్ బాబు, చేగొంటి శ్రీను, రామచంద్రరాజు, రాజ్ కుమార్ ఆచార్య, పద్మ, రజినీ, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.



పాడేరులో గంగమ్మ తల్లి పండగ ఉత్సవాలకు హాజరై తల్లిని దర్శించుకున్న అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోడా సింహాద్రి. స్థానిక మాజీ సర్పంచ్ రత్నం, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ప్రతినిధి అడపా సురేష్ కుమార్ మరియు గ్రామ ప్రజలు.

## తేనెటీగల దాడిలో మహిళ మృతి

భీమునిపట్నం: తేనెటీగల దాడిలో మహిళ మృతి చెందినట్లు భీమిలి పోలీసులు తెలిపారు. పోలీసులు ఇచ్చిన వివరాల ప్రకారం భీమిలి మండలం లోని, తాటితూరు గ్రామంలో ఉన్న సోమాలమ్మ అమ్మవారి గుడి వద్ద భక్తులు మంగళవారం పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. అయితే అమ్మవారికి సాంబ్రాణి పొగ వేసారు. కాగా సాంబ్రాణి పొగకు గుడి ఆవరణలోని రావిచెట్టు పై ఉన్న కందిరీగల గుంపు చెదిరి వీరిపై దాడి చేసాయి. అయితే అందరు ప్రాణభయంతో పరుగులు తీశారు.అప్పయ్యమ్మ (69) అనే భక్తురాలిపై అవి ఒకేసారి దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు.

కాగా ఆమెను ఆసుపత్రి కి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడినను సకాలంలో వైద్యసాయం అందడంతో ప్రాణాపాయం నుంచి బయట పడ్డారనీ పోలీసులు తెలిపారు.

## నేడు బీజేపిలో చేరికలు

భీమునిపట్నం: స్థానిక చిన్నబజార్ ఫంక్షన్ హాల్‌లో గురువారం కె.రామానాయుడు, అతని అనుచరులు బీజేపిలో చేరుతున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ విశాఖ యంపీ హరిబాబు, ఎమ్మెల్సీ మాధవ్, నగర అద్యక్షుడు రవీంద్ర తదితరులు హాజరవుతున్నారు.

### శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో
## కరోనా కట్టడిక చర్యలు



విశాఖపట్నం :శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం, బురుజుపేట, విశాఖపట్నం నందు ముందస్తు జాగ్రత్త నిమిత్తము శ్రీ అమ్మవారి దర్శనమునకు విచ్చేయు భక్తులకు ప్రాచీన ఆయుర్వేద వైద్య నిపుణుల సూచనల మేరకు దాల్చిన చెక్క, లవంగాలు, పసుపు, తులసి, మిరియాలతో కూడిన మిశ్రమాన్ని పంపిణీచేయుట జరిగినది.

నేటి నుండి త్రికాలార్చనలలో ప్రాతః కాల పూజ మరియు సాయంత్రం 6.00 గంటల పూజలు మాత్రమే నిర్వహించుట జరుగును. తీర్థ ప్రసాద వితరణ నిలుపుదల చేయడమైనది. అన్న ప్రసాద వితరణ సామూహిక పంతి భోజనములకు బదులు సెల్ఫ్ సర్వీసింగ్ ఏర్పాటు చేయడమైనది.

తదుపరి శ్రీ అమ్మవారి దత్తత దేవలయమగు సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానము, అంబికబాగ్ నందు శ్రామనవమి ఉత్సవములు అతి సాదరణముగా చేయుటకు నిర్ణయించ డమైనది. కావున భక్తులు దేవస్థాన అధికారులతో సహకరించ మనవి.

## జాతీయ పథకాల పై పరిశోధనకు డాక్టరేట్



ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్ర విశ్వవిద్యాలయం పర్యావరణ శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి దానబత్తుల గిరిబాబుకు వర్సిటీ డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు పి.వి.వి ప్రసాద రావు, ఇస్రో, ఎన్ఆర్ఎస్‌సి శాస్త్రవేత్త డాక్టర్ సి.సుధాకర్ రెడ్డిల సంయుక్త పర్యవేక్షణలో 'ఎసెస్‌మెంట్ ఆఫ్ నేషనల్ ప్రాజెక్ట్స్ ఇన్ ద ఫ్రేమ్‌వర్క్ ఆఫ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ యూజింగ్ జియోస్పేషియల్ టెక్నాలజీస్' అంశంపై జరపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, స్వచ్ఛభారత్ పథకాలు ఐక్యరాజ్యసమితి నిర్ధారించిన అభివృద్ధి లక్ష్యాల సాధనకు దోహదం చేస్తున్న విధానాపై నేషనల్ రిమోట్ సెంటర్ శాస్త్రవేత్తగా పనిచేస్తున్న గిరిబాబు పరిశోధన జరిపారు. ఉపగ్రత చిత్రాలు, ఆధునిక సాంకేతికత సహకారంతో విశ్లేషించారు.స్వచ్ఛభారత్ పథకంతో అతిసారం నియంత్రణ, స్త్రీలపై అత్యాచారాల నియంత్రణకు ఉపయుక్తంగా నిలుస్తున్నట్లు గిరిబాబు తన పరిశోధనలో వివరించారు.

## 120 కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభించాలి: సీఎం జగన్



అమరావతి: మొక్కజొన్నకు ప్రకటించిన కనీస గిట్టుబాటు ధర కోసం చర్యలు చేపట్టాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మార్కెటింగ్శాఖపై సీఎం వైఎస్ జగన్ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. మొక్కజొన్న, జొన్న మార్కెట్‌కి వచ్చే సమయం ఇదని, వీటి ధరల్లో తగ్గుదల ఉందన్నారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 1 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని, ఖరీఫ్, రబీలో వరి ఉత్పత్తి పెరిగిందని అధికారులు సీఎం జగన్ తెలిపారు. గొడౌన్స్ ఏర్పాటుపై సీఎం జగన్ సమీక్ష చేశారు. మన గోడౌన్స్‌తో పాటు ఎఫ్‌సీఐ గోడౌన్స్ కూడా తీసుకోవాలని సీఎం జగన్ ఆదేశాలు జారీ చేశారు. 120 కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభించాలని సీఎం చెప్పారు. 2020-2021 ఏడాదిలో మిషన్ గోడౌన్స్ ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఇప్పటికే రూ. 321 కోట్లు కేటాయిస్తూ సీఎం వైఎస్ జగన్ ఆదేశాలు ఇచ్చారు. గోడౌన్స్ కోసం స్థలాలు చూడాలని జిల్లా కలెక్టర్లకి సీఎం జగన్ ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా అరటికి గిట్టుబాటు ధర రూ. 800 రూపాయలు ప్రకటించామని, ధర అధికంగా ఉంది కాబట్టి ఇబ్బంది లేదన్నారు. ఒకవేళ తగ్గితే తన ఆదేశాల కోసం వేచి చూడకుండా కొనుగోలు చేయాలన్నారు. పౌల్ట్రీ పరిశ్రమ ఒత్తిడికి గురికావడం వల్ల మొక్కజొన్న ధర తగ్గి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఉభయ గోదావరి జిల్లాలో ఉన్న చివరి భూములకు నీరు ఇవ్వడానికి సీలేరు నుంచి నీటి విడుదలకు సీఎం జగన్ ఆదేశాలు ఇచ్చారు. ఈ ఏడాది అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వేరు శనగ విత్తనాల సరఫరా చేస్తున్నామని సీఎం జగన్ తెలిపారు. ఈ సమీక్షలో వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు, అధికారులు పాల్గొన్నారు.

## వ్యాధినిరోధక శక్తి అభివృద్ధి మందులు (హోమియో) అందరికి అందజేయాలి చేతులు శుభ్రంగా కడుగుకోవాలి



విశాఖపట్నం : జిల్లా జాయింట్ కలెక్టర్ ఎల్. శివ శంకర్ విశాఖపట్నం,మార్చి, 18: వ్యాధి నిరోధక శక్తి అభివృద్ధి మందులు అందరికి అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎల్. శివ శంకర్ మెడికల్ ఆఫీసర్స్ ని ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్ లో ఆయన ఆయుష్ శాఖ మెడికల్ అధికారులతో ఆయన మాట్లాడారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కరోనా రాకుండా నిలువరించేందుకు వ్యాధి నిరోధక శక్తి అభివృద్ధి (హోమియో) మందులు అందరికి అందజేయాలన్నారు. చేతులు శుభ్రంగా కడుగుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా. ఆర్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆయుష్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కరోనా వైరస్ (కోవిడ్-19) రాకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వ్యాధి నిరోధక శక్తి అభివృద్ధికి ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయం సిబ్బంది, జిల్లా ఖజానా శాఖ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తదితర కార్యాలయల సిబ్బందికి ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డా. అరుణ్ ప్రకాష్, డా. వెంకటేశ్వరరావు, డా. జి. హరికృష్ణ, డా. ఎం.రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



*55వ వార్డు వైఎస్ఆర్ సీపీ అభ్యర్థి కెవిఎన్ శశికళను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరిస్తున్న నార్త్ బీసీ సెల్ ప్రెసిడెంట్ బొడ్డేటి గంగా మహేష్*

## డిఎక్స్‌సి టెక్నాలజి కు 42 మంది గీతం విద్యార్థుల ఎంపిక




సాగర్‌నగర్ : ప్రపంచ వ్యాప్తంగా 70 దేశాలలో కార్యకలాపాలను విస్తరించిన డిఎక్స్‌సి టెక్నాలజీ సంస్థ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో 42 మంది విద్యార్థులను ఎంపిక చేసుకుందని ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ అధికారి గురుమూర్తి గంగాధరన్ తెలిపారు. సంస్థ ఎంపిక చేసుకున్న వారిలో అధికంగా ఇంజనీరింగ్ ఆఖరి ఏడాది అభ్యసిస్తున్న బాలికలు ఉన్నారని పేర్కొన్నారు. డిఎక్స్‌సి టెక్నాలజీ నిపుణుల బృందం వివిధ వడపోతల అనంతరం పరిశ్రమల పట్ల విద్యార్థులకు గల అవగాహన, ఆఖరి సంవత్సరం విద్యార్థులు నిర్వహించిన ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు వంటివి పరిశీలించి ఆన్‌లైన్ పరీక్ష, టెక్నికల్, హెచ్ ఆర్ విభాగాల ద్వారా మొత్తం 42 మంది విద్యార్థులను ఎంపిక చేసుకుందన్నారు. ఇంజనీరింగ్‌లో కోర్ బ్రాంచిలకు చెందిన విద్యార్థులతో పాటు ఎమ్‌సిఎ విద్యార్థులకు డిఎక్స్‌సి టెక్నాలజీ సంస్థ అవకాశం కల్పించిందని తెలిపారు. కాగా ఎంపికయిన విద్యార్థులను గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.ధర్మరాజు అభినందించారు.

**కొత్త తరహ ఉద్యోగాలు :**

ఈ ఏడాది ప్రాంగణ నియామకాలు నిర్వహిస్తున్న కంపెనీలు గతానికి భిన్నంగా ఇంజనీరింగ్ విద్యార్థులలో కోడింగ్ నిపుణతపై అధికంగా దృష్టి పెడుతున్నాయని గీతం ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ అధికారి గురుమూర్తి గంగాధరన్ వెల్లడించారు. కోడింగ్‌తో పాటు ప్రోగ్రామింగ్ స్కిల్స్, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్, బిగ్‌డేటా, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి అంశాలపై విద్యార్థులకు గల అవగాహన ఆధారంగా ఎంపికలు జరిగాయన్నారు. అదేవిధంగా సైబర్ సెక్యూరిటీ అంశాలతో పాటు విద్యార్థుల ప్రాజెక్టులో, ఇంటర్న్‌షిప్ వంటి వాటిపై రిక్రూటర్లు ప్రధానంగా ప్రశ్నలు సంధిస్తున్నారని ఆయన తెలిపారు. విద్యార్థుల విషయ పరిజ్ఞానాన్ని విడివిడిగా విశ్లేషించి లోటు పాట్లను తెలియజేయటం ద్వారా ప్రాంగణ నియామకాలలో విజయం సాధించడానికి మార్గాన్ని చూపుతున్నట్లు తెలిపారు. త్వరలో గీతం ప్రాంగణ నియామకాల సంఖ్య రికార్డు నమోదు చేయనున్నదని ఆయన పేర్కొన్నారు.

## విశాఖ చేరుకున్న తెలుగు విద్యార్థులు

విశాఖ సిటీ: కరోనా వైరస్ ఆందోళన నేపథ్యంలో మలేసియా రాజధాని కౌలాలంపూర్ విమానా శ్రయంలో చిక్కుకున్న సుమారు 185 మందికి పైగా తెలుగు విద్యార్థులు విశాఖ చేరుకున్నారు. విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న విద్యార్థులకు వైద్యులు నాలుగు బృందాలుగా ఏర్పడి పరీక్షలు నిర్వహించారు. వారిలో జలుబు, దగ్గు లక్షణాలతో ఉన్న విద్యార్థులను 'ఎ' కేటగిరీగా విభజించినట్లు ఏసీపీ స్వరూప తెలిపారు. రక్తపోటు, మధుమేహం ఉన్న వారిని 'బి' కేటగిరీగా, ఎలాంటి లక్షణాలు లేకుండా ఆరోగ్యంగా ఉన్నవారిని 'సి' కేటగిరిగా విభజించి కావాల్సిన వైద్య పరీక్షలు చేయనున్నట్లు ఏసీపీ తెలిపారు.

కేటగిరీ వారీగా అనుమానితులను క్వారంటైన్ కేంద్రాలకు, మిగిలిన విద్యార్థులను ఐసోలేషన్ వార్డులకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఏసీపీ స్వరూప తెలిపారు. తెలుగు రాష్ట్రాల విద్యార్థులతో పాటు ఇతర రాష్ట్రాల విద్యార్థులు కూడా కొంత మంది ఉన్నారని... పోలీసు బందోబస్తుతో వారిని ప్రత్యేక బస్సుల ద్వారా ఆయా రాష్ట్రాలకు చెందిన వైద్య ఆరోగ్య శాఖ అధికారుల వద్దకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు -ఏసీపీ తెలిపారు.

మరోవైపు ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో దాదాపు 100 మందికిపైగా భారతీయ విద్యార్థులు చిక్కుకున్నారు. భారత్‌కు రప్పించేలా ఏర్పాట్లు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆ విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కోవిడ్-19 రాకుండా జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు

**వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వి.వినయ్ చంద్**




విశాఖపట్నం : నగరంలో 'కోవిడ్-19' రాకుండా అవసరమైన చర్యలు పటిష్టంగా చేపడుతున్నామని జిల్లా కలెక్టరు వి.వినయ్ చంద్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నీలం సహానికి తెలియజేశారు. బుధ వారం సాయంత్రం ముఖ్య కార్యదర్శి అమరావతి నుండి రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లతో 'కోవిడ్-19' రాకుండా తీసుకున్న చర్యల గురించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. విశాఖపట్నం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్ వినయ్ చంద్ మాట్లాడుతూ బుధవారం సాయంత్రం గం. 6:45 ని. లకు విదేశాలనుండి భారతీయులను తీసుకు వస్తున్న విమానంలో 185మంది ప్రయాణీకులు విశాఖపట్నం వస్తున్నారన్నారు. వారిని విమానాశ్రయంలోనే పరీక్ష చేసి మూడు కేటగిరీలుగా చేసి తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. అనుమానం ఉన్న 'ఎ' కేటగిరి వారిని చాతీ ఆసుపత్రికి, 'బి' కేటగిరీకి చెందిన వాళ్లను విమ్స్ ఆసుపత్రిలో క్వారింటైన్ సెంటర్ కి తీసుకువెళ్లి 14 రోజులు పరిశీలనలో ఉంచుతారన్నారు. 'సీ' కేటగిరి వారిని సొంత ఊర్లకు తరలించి ఇంటిలోనే క్వారెంటైన్ గా ఉండే విధంగా చర్యలు చేపడతారని తెలిపారు.185 మంది నాలుగు దేశాల నుండి విశాఖకు రప్పిస్తున్నారని, వారిలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువమంది వుంటారని భావిస్తున్నామని, ముందస్తు చర్యలు చేపట్టిన తరువాత వారందరినీ సొంత ఇళ్ళకు చేర్చేలా పగడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ముఖ్య కార్యదర్శికి తెలిపారు.

## రేల్వే ప్రయాణికులకు కరోనా వ్యాధిపై అవగాహన కల్పించాలి

**సార్క్ నేషన్స్ అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం ఆంధ్ర ప్రదేశ్ ఛైర్మెన్ కంచరాన కిరణ్ కుమార్ ....**




కంచరపాలెం : రేల్వే ప్రయాణికులకు కరోనా వ్యాధిపై పూర్తి స్థాయిలో అవగహన కల్పించాలని సార్క్ నేషన్స్ అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం ఆంధ్ర ప్రదేశ్ ఛైర్మెన్ కంచరాన కిరణ్ కుమార్ విజ్ఞప్తి చేసారు. ఈమేరకు ఈస్ట్ కోస్ట్ రైల్వే డివిషనల్ సెక్యూరిటీ కమీషనర్ ఆర్ .పి.ఎఫ్ జితేంద్ర శ్రీ వాత్సవ్ ను దొండపర్తి డి.అర్ .ఎం .ఓ కార్యాలయంలో బుదవారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిశారు.

ప్రస్తుతం దేశంలో కరోనా వ్యాప్తి పై ప్రజలు భయాందోళనలో ఉన్నారని అన్నారు.

ముఖ్యంగా వివిద ప్రాంతల్లో నివాసముంటున్న ప్రజలు ఉద్యోగ , శుభకార్యాలు, ఇతర కారణాల రిత్యా ఎక్కువగ సుదూర ప్రాంతాలకు వెళ్ళే వారు ఎక్కువ శాతం రైలు పై వెళ్తుంటారని అటువంటి వారు ప్రయా ణాలు చేసే సమయంలో తగిన జాగ్రతలు తీసుకోవాలన్నారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే డివిషనల్ సెక్యూరిటీ కమీషనర్ ఆర్ .పి.ఎఫ్ జితేంద్ర వాత్సవ్ మాట్లడుతూ ఇప్పటికే కరోనా వ్యాధిపై రైల్వే ప్రయాణికులకు అవగహన కల్పించేందుకు ప్రత్యేక సిబ్బందిని విధులకు కేటాయించడం జరిగిందని సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తు ప్రజలకు అవగహన కల్పిస్తున్నారన్నారు . అదేవిదంగా వాల్తేరు డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

అలాగే ఆర్ .పి.ఎఫ్ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ రైల్వే క్వాటర్స్, రైల్వే స్టేషన్‌ల వద్ద దొంగతనాలను అరికట్టడం జరిగిందని అన్నారు. అంతకుముందు జితేంద్ర శ్రీ వాత్సవ్‌ను కలసిన సార్క్ నేషన్స్ అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం ఆంధ్ర ప్రదేశ్ ఛైర్మెన్ కంచరాన కిరణ్ కుమార్ పుష్ప గుచ్చాలు అందజేసి ఉగాది శుభాకంక్షాలు తెలియజేశారు .

*బుధవారం చినవాల్తేర్ 21వ వార్డు పరిధిలో గల ఈస్ట్ పాయింట్ కాలనీలో శ్రీశ్రీశ్రీ సాయిబాబా వారి ఆలయ 27వ వార్షికోత్సవం సందర్భంగా విశేష పూజా కార్యక్రమంలో వైసీపీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. స్వామి వారికి ఉదయం నుంచి పలు రకాల అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామి వారి పూజ అనంతరం తీర్థ ప్రసాదములు వంశీకృష్ణకి ఆలయ అర్చకులు అందజేశారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయం అర్చకులు, అబ్బులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.*



# విజయభాను

## సంపాదకీయం

### పర్యాటకానికి కరోనా ఎఫెక్ట్

చైనా తర్వాత జనసాంద్రత ఎక్కువ కలిగిన దక్షిణాసియాలో వైరస్ విస్తరిస్తే పెను ఉపద్రవమే. సార్క్ దేశాలన్నింటా ఒకేవిధమైన వాతావరణ పరిస్థితులుంటాయి. జీవనరీతులు, ప్రమాణాలు కూడా దాదాపుగా ఒకే స్థాయిలో ఉంటాయి. అయినా ఈ దేశాల్లో ఒక్కో దేశానిది ఒక్కో సమస్య. మాల్దీవులకు వైరస్‌ను నిలువరించే ఆర్థిక, వైద్య, శాస్త్రపరిజ్ఞానం తగినంతగా లేదు. నిధుల కొరత సరేసరి. శ్రీలంక, భూటాన్ లాంటి దేశాలు చిన్నవైనా టూరిజం గణనీయంగా ఉంటుంది. గరిష్ఠ స్థాయిలో ప్రపంచ దేశాలనుంచి సందర్శకులుంటారు. కాబట్టి వైరస్ విస్తరణ ప్రమాదం ఎక్కువ. దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంస్థ (సార్క్) పునరుజ్జీవనానికి కరోనా వైరస్ పరోక్ష దోహదకారిగా మారుతున్నది. బద్ధ శత్రువులైనా ఆపద సమయాల్లో దగ్గరవుతారన్న నానుడిని నిజం చేస్తూ ఇన్నాళ్లూ ఎడమొఖం, పెడమొఖంగా ఉన్న దేశాలు ఏకతాటిపైకి వచ్చి చేయిచేయి కలుపుతున్నాయి. దక్షిణాసియా దేశాల్లో వైరస్ విస్తరించకుండా కట్టడి చేసేందుకు కలిసి నడువటానికి సమాయత్తమవుతున్నాయి. పాకిస్థాన్‌తో సహా సార్క్ సభ్యదేశాలన్నీ భారత్ పిలుపునకు సానుకూలంగా స్పందించాయి. దేశ దేశాలను వణికిస్తున్న కోవిడ్-19ని ఎదుర్కోవటం కోసం సార్క్ దేశాల మధ్య పరస్పర సహకారం అవసరమని ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపునకు సార్క్ దేశాధినేతల నుంచి తక్షణ స్పందన లభించింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా మోదీ ప్రతిపాదించిన వెంటనే సార్క్ సభ్యదేశాధినేతలంతా దృశ్య మాధ్యమ సదస్సులో భాగస్వాములవటం ముదావహం. సార్క్ దేశాల మధ్య గత నాలుగేండ్లుగా సయోధ్య లేదు. భారత్‌లో యురి ఉగ్రదాడి నేపథ్యంలో 2016లో పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో జరుగాల్సిన సార్క్ సదస్సును భారత్‌తో సహా మిగతా సభ్య దేశాలన్నీ బహిష్కరించాయి. పాకిస్థాన్ తన భూభాగాన్ని ఉగ్రవాదానికి స్థావరంగా చేయటం మానేయాలని డిమాండ్ చేశాయి. ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసినప్పుడు మాత్రమే టెర్రరిజానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరులో పాక్ పాత్రను విశ్వసిస్తామని తేల్చి చెప్పా యి. అప్పటినుంచి ఈ ప్రాంతీయ కూటమి ద్వారా సాగే దౌత్య, రాజకీయ సంబంధాలు నామమాత్రంగా మిగిలిపోయాయి. ప్రాంతీయాభివృ ద్ధి, వర్తక వాణిజ్యాల కోసం సభ్యదేశాల మధ్య అత్యున్నత రాజకీయచర్చలు జరుగాలని శ్రీలం క, నేపాల్, మాల్దీవులు అప్పటినుంచీ కోరుతున్నాయి. కానీ దానికి తగిన రాజకీయ వాతావర ణం లేదని భారత్ చెబుతూ వచ్చింది. కోరలు చాస్తున్న కోవిడ్ కాటునుంచి దక్షిణాసియా ప్రాం తాన్ని సంరక్షించుకోవాలంటే ముందస్తు చర్యలు అవసరమని గుర్తించిన భారత్ తగురీతిన చొరవ తీసుకున్నది. సార్క్ సభ్యదేశాలైన ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, ఇండియా, మాల్దీవులు, నేపాల్, పాకిస్థాన్, శ్రీలంక దేశాల అధినేతలతో వీడియో కాన్ఫరెన్స్‌కు ప్రతిపాదించింది. మోదీ ప్రతిపాదనకు సార్క్ నేతలంతా స్వల్పవ్యవధిలో నే స్పందించారు. నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీ శస్త్రచికిత్స చేసుకొని దవాఖాన నుంచి బయటకు వచ్చిన మరునాడే పాలుపంచుకోవడాన్ని బట్టి సదస్సుకు లభించిన ప్రాధాన్యం అవగతమవుతున్నది. పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ మాత్రం నేరు గా భాగస్వామి కాకుండా ఆరోగ్యరంగ సలహాదా రు జాఫర్ మీర్జాను నియోగించారు. ఎప్పటిలాగే ఈ సందర్భంగా కూడా పాకిస్థాన్ రాజకీయ ప్రస్తావనలు చేసి వక్రబుద్ధిని చాటుకున్నది. మానవాళికి ప్రమాదం ముంచుకొస్తున్న పరిస్థితుల్లో కూడా మానవీయంగా స్పందించేబదులు రాజకీయాలు చేయటం గర్హనీయం. చైనా తర్వాత జనసాంద్రత ఎక్కువ కలిగిన దక్షిణాసియాలో వైరస్ విస్తరిస్తే పెను ఉపద్రవమే. సార్క్ దేశాలన్నింటా ఒకేవిధమైన వాతావరణ పరిస్థితులుంటాయి. జీవనరీతులు, ప్రమాణాలు కూడా దాదాపుగా ఒకే స్థాయిలో ఉంటాయి. అయినా ఈ దేశాల్లో ఒక్కో దేశానిది ఒక్కో సమస్య. మాల్దీవులకు వైరస్‌ను నిలువరించే ఆర్థిక, వైద్య, శాస్త్రపరిజ్ఞానం తగినంతగా లేదు. నిధుల కొరత సరేసరి. శ్రీలంక, భూటాన్ లాంటి దేశాలు చిన్నవైనా టూరిజం గణనీయంగా ఉంటుంది. గరిష్ఠస్థాయిలో ప్రపంచ దేశాలనుంచి సందర్శకులుంటారు. కాబట్టి వైరస్ విస్తరణ ప్రమాదం ఎక్కు వ. ఈ దేశాలన్నింటా విస్తారంగా ఉన్న గ్రామీణ వెనుకబడిన ప్రాంతాల్లో వైరస్ మరింత ప్రమాదభరితంగా మారే అవకాశం ఉన్నది. అందుకే కోవిడ్-19ను నిలువరించటం కోసం ప్రధాని మోదీ ఇప్పటికే కోటి డాలర్ల సాయాన్ని ప్రకటించి, మిగతా దేశాలకు మార్గదర్శకంగా నిలిచారు. పొరుగు దేశాల వినతి మేరకు వైద్య బృందాలను పంపేందుకు సంసిద్ధతను వ్యక్తం చేశారు. మాల్దీవుల విజ్ఞప్తి మేరకు 48 గంటల్లోనే భారత్ అత్యవసర వైద్యసిబ్బందిని పంపించింది. ఇరాన్ చేసి న వినతులను కూడా మానవతా దృక్పథంతో పరిశీలిస్తున్నట్లు భారత్ తెలిపింది. కరోనాను కట్టడి చేసేందుకు మోదీ తీసుకున్న చొరవను అమెరికా, రష్యా దేశాధినేతలు కూడా శ్లాఘించటం గమనించదగినది. సార్క్ తరహాలో జీ-20 దేశాలు కూడా ఆన్‌లైన్ యంత్రాంగంతో అనుసంధానమవ్వాలని భారత్ ప్రతిపాదించింది.

# మీతోనే ఉంటా..



మురళీనగర్‌: ప్రజాసేవ చేయటానికే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి మహానగర గ్రేటర్ ఎన్నికల్లో 50వ వార్డు నుండి పోటీ చేస్తున్నానని వైఎస్ఆర్ సీపీ బలపరిచిన అభ్యర్థి వావిళ్లపల్లి ప్రసాద్ తెలియజేశారు. 50వ వార్డులోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలను, యువకులను, పలు అనుబంధ సంఘాల ప్రతినిధులను ఆప్యాయ అనురాగాలతో పలకరిస్తూ తన ప్రచారాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. మాధవధార, తెన్నేటి నగర్, మురళీనగర్, అయ్యప్ప నగర్, వర్మా కాంప్లెక్స్ తదితర ప్రాంతాలలో నిరాడంబరుడుగా గుర్తింపు పొందిన వావిళ్లపల్లి ప్రసాద్ లాంటి యువకుడు, విద్యావేత్త , సామాజిక స్పృహ కలిగిన వ్యక్తులను ఎన్నుకోవడం ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమౌతుందని పలువురు మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆయన బాటలో సూరిశెట్టి లక్ష్మణ్, అధిక సంఖ్యలో యువత నడుస్తున్నారు.

# జిల్లా కలెక్టర్ డైక్ పనుల పరిశీలన

శ్రీకాకుళం: నాగావళి నదిలో నిర్మిస్తున్న డైక్ పనులను జిల్లా కలెక్టర్ జె నివాస్ బుధ వారం పరిశీలించారు. నాగావళి రివర్ ఫ్రంట్ వ్యూ పార్కులో భాగంగా నిర్మిస్తున్న డైక్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని శ్రీకాకుళం పట్టణ వాసులకు మంచి ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కల్పించాలన్నారు. నాగావళి నదిలో డైక్ నిర్మాణం వలన సంవత్సరం పొడుగునా కనీసం ఒక మీటరు లోతులో నీరు నిల్వ ఉంటుందని, బోటు షికారు వంటి ఏర్పాట్లకు అవకాశం పరిశీలించాలని ఆయన ఆదేశించారు. డైక్ నిర్మాణం వలన నీరు నిల్వ ఉండి ఆహ్లాద వాతావరణం ఏర్పడటంతో ప్రజలు వీక్షించుటకు వస్తారని అందుకు తగిన ప్లాట్ ఫారాలు నిర్మించాలని ఆదేశించారు. నాగావళి నదికి రెండు వైపులా ఆర్ట్సు కళాశాల దిక్కులోను, దత్తాత్రేయ ఆలయం దిక్కులోను సురక్షితంగా, ప్రశాంతంగా వీక్షించుటకు అవసరమగు మెట్లను నిర్మించాలని సూచించారు. నది మధ్యలో జిల్లా విశిష్టతను తెలియజేసే చారిత్రాత్మక విగ్రహాన్ని నెలకొల్పుటకు అవకాశాలు పరిశీలించాలని పేర్కొన్నారు. డైక్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఇప్పటికే నిర్మాణంలో జాప్యం జరిగిందని, వేగవంతం చేయాలని ఆదేశించారు.

అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో సమీక్షిస్తూ నగర పాలక సంస్థ పరిధిలో చేపట్టిన పనులు వేగవంతం కావాలని కలెక్టర్ ఆదేశించారు. డైక్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, నవభారత్ జంక్షన్ నుండి పాత బ్రిడ్జి వరకు నిర్మిస్తున్న రహదారి పనులు మూడు వారాల్లో పూర్తి కావాలని ఆయన ఆదేశించారు. జాప్యం జరగరాదని పేర్కొన్నారు. ఇతర పనులు కూడా త్వరితగిన పూర్తి చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమీషనర్ పి.నల్లనయ్య, రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.వి.రమణ, సహాయ కమీషనర్ శివ ప్రసాద్, ఇపిడీసీఎల్ ఎస్ఇ ఎన్. రమేష్, జిల్లా ఆడిట్ అధికారి కె. రాజు, నగర పాలక సంస్థ ఇంజినీర్లు రమణ మూర్తి, మాధవ రావు, ప్రజా ఆరోగ్య శాఖ డిఇ వెంకట రావు, ఆరోగ్య అధికారి వెంకట రావు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ నాయకులు జె.బి.కృపలానీ వర్ధంతి



ఆచార్య కృపలానీ నేటి పాకిస్తాన్ లోని హైదరాబాద్ లో 1888 నవంబర్ 11 న జన్మించారు. పూర్తి పేరు జీవత్ రామ్ భగవాన్ దాస్ కృపలానీ. కొంతకాలం మదన మోహన్ మాలవ్య అంతరంగిక కార్యదర్శిగా పనిచేశారు. ఇంగ్లీష్, చరిత్ర విషయాల ప్రొఫెసర్ గా ముజఫర్ లోనూ, బెనారస్ విశ్వ విద్యాలయం లో ప్రొఫెసర్ గా పనిచేస్తూ ఆ పదవిని త్యజించి సహాయ నిరాకరనోద్యమం లో పాల్గొన్నారు. 1922-27 మధ్య గాంధీజీ స్థాపించిన గుజరాత్ విద్యా పీఠాన్ని కి ఆచార్యులుగా ఉన్నారు. అప్పటి నుంచి ఈయనను ఆచార్య క ృపలానీ గా అందరూ సంబోధిస్తారు. 1934-46 మధ్య అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా భాధ్యతలు నిర్వహించారు. 1946 లో అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షు లైనారు. దేశ పాలనకు సంబంధించిన నిర్ణయాలలో కాంగ్రెస్ పార్టీ అభిప్రాయాలు తీసుకోవాలని క ృపలానీ భావన. దానికి నెహ్రూ, పటేల్ అంగీకరించక పోవడంతో వీరు కాంగ్రెస్ పార్టీ కి దూరమయ్యారు. వీరు అధికార పక్షానికి చెవిలోని జోరీగ లాగా పోరు పెట్టేవారు. గొప్ప విమర్శకులైనా వీరు అత్యవసర పరిస్థితుల్లో అరెస్ట్ అయ్యారు. తదనంతరం ఏర్పడిన జనతా ప్రభుత్వంలో గుర్తింపు పొందారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చే సమయానికి వీరు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఉన్నారు. ఈయన భార్య సుచేత కృపలానీ ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఈమె మన దేశపు మొదటి మహిళా ముఖ్యమంత్రి. 1951 లో కృపలానీ కిసాన్ మజ్దూర్ పార్టీ ని ఏర్పాటు చేశారు. వీరు 94 ఏళ్ల వయస్సు లో మార్చి 19, 1982 న మరణించారు.

## సమయం (కవి సమయం)

### మంచి మాట

మంచి మాట మహాత్ముల లక్షణం
మంచిగా మాట్లాడు, ప్రేమతో మాట్లాడు
సహృదయంతో, ఓదార్పునిస్తూ మాట్లాడు
చల్లని వెన్నెలలా
స్వాంతన కలిగించే మందులా
గిలిగింతలు పెట్టి తొలకరి జల్లులా
ప్రేమగా, ఆనందంగా
పరులకు సంతోషానిచ్చే విధంగా
మన పలుకులు వుండాలి
పదునైన ఆయుధంతో
తుట్లు పొడిచేలా వచ్చే మాటలు
వినాశ హేతువు, విధ్వంస కారకం

...కవితా రచన
సి.ప్రతాప్
సెల్ నెం: 90636 22665

## పంచాంగం

మాసం : ఫాల్గుణ; తిథి : దశమి ఉ.7.24; ఉ.షా.సా.5.21; రా.వ.9.33ల 11.13 | గురువారం 19-03-2020

**మేషం :** పెద్దల ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతారు. విద్యార్థులకు ప్రింటింగ్ రంగాలవారికి సదా వకాశాలు లభిస్తాయి. కాంట్రాక్టర్లకు నూతన టెండర్ల విషయంలో పునరాలోచన అవసరం. బంధువులను కలుసుకుంటారు.

**వృషభం:** కోర్టు వాదోపవాదాల్లో ప్లీడర్లకు గుర్తింపు లభిస్తుంది. ఉద్యోగస్తులు, ఒత్తిళ్ళు, ఆకర్షణలకు దూరంగా ఉండటం అన్నివిధాలా క్షేమదాయకం. మీ శ్రీమతి సూటిపోటి మాటలు అసహనం కలిగిస్తాయి. దైవ సేవా కార్యాక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. అనుకోకుండా నిరుద్యోగుల యత్నాలు ఒక కొలిక్కి రాగలవు.

**మిథునం** :బ్యాంకు వ్యవహారాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల మెళకువ అవసరం. వీలైనంతవరకు మీ పనులు మీరే చూసుకోవటం ఉత్తమం. ఆదాయాన్ని కన్నా ఖర్చులు అధికంగా ఉంటుంది. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునారాలోచన మంచిది. విద్యార్థినులకు ఒత్తిడి ఆందోళనలు ఎదుర్కొంటారు.

**కర్కాటకం:**వ్యాపారవేత్తలు ప్రస్తుత పరిస్థితిని కొనసాగ నివ్వడం మంచిది. ప్రముఖులను కలుసుకుంటారు. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. ప్రింటింగ్ రంగాలవారికి సదవకాశాలు లభిస్తాయి. మీ సంతానం మొండివైఖరి మీకెంతో చికాకు కలిగిస్తుంది. హామీలు చెక్కుల జారీల్లో ఏకాగ్రత వహించండి.

**సింహం** :విద్యార్థులు తోటి విద్యార్థులతో విందులు, వేడుకలలో పాల్గొంటారు. అవసరానికి సరిపడ ధనం సమకూరుట వల్ల ఆర్థిక ఇబ్బంది అంటూ ఏదీ ఉండదు. మీ అవసరాలకు కావలసిన ధనం సమయానికి సర్దుబాటు అవుతుంది. ప్రైవేట్ ఫైనాన్సు సంస్థలో పొదుపు చేయటం మంచిది కాదని గమనించండి.

**కన్య** : పెద్దల జోక్యంతో అనుకోకుండా ఒక సమస్య సానుకూలమవుతుంది. పంతాలకు పోకుండా బంధువులతో ఆదరంగా మెలగండి. బంధుమిత్రుల కలయికతో ఉత్సాహం చోటుచేసుకుంటుంది. దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తుతాయి. స్త్రీలకు షాపింగ్ విషయాలలో అపరిచిత వ్యక్తులపట్ల మెళకువ అవసరం.

**తుల** : ఆత్మీయుల నుంచి అందిన ఆహ్వానం మిమ్ములను ఇరకాటానికి గురిచేస్తుంది. విలాసవస్తువులు అమర్చుకోవాలనే స్త్రీల కోరికలు నెరవేరుతాయి. చేతి వృత్తులు, చిరు వ్యాపారులకు అన్నివిధాలా కలిసివస్తుంది. ప్రయాణాలలో ఇబ్బందులు తలెత్తుతాయి. నిరుద్యోగలకు రాతపరీక్షలు, ఇంటర్వ్యూలు సత్ఫలితాలనిస్తాయి.

**వృశ్చికం** : పాత మిత్రులను కలిసి వారికి శుభాకాంక్షలు అందజేస్తారు. నూతన పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. ఉద్యోగస్తులకు పైఅధికారుల నుంచి మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. నూతన వస్త్రప్రాప్తి ప్రముఖుల కలయిక ప్రయోజనకరంగా ఉంటుంది. రుణ విముక్తులు కావడంతో మానసికంగా కుదుటపడతారు.


**ధనుస్సు** :రాజకీయ నాయకులు పార్టీ సభ్యులతో కలిసి విందు, వినోదాలలో పాల్గొంటారు. సంఘంలో మీ స్థాయి పెరుగును. పెద్దల ఆరోగ్యం కుదుటపడుతుంది. వ్యాపారరీత్యా దూరప్రయాణాలు చేస్తారు. బంధుమిత్రులకు, ప్రముఖులకు శుభాకాంక్షలు అందజేస్తారు. టెక్నికల్, ఎలక్ట్రానిక్, కంప్యూటర్, రంగాల్లో వారికి ఒత్తిడి తప్పదు.

**మకరం** :ఆర్థికంగా ఎదగాలనే మీ ఆశయం నిదానంగా ఫలిస్తుంది. కుటుంబీకులతో కలిసి విందులు, వినోదాలు, సమావేశాలు ఉల్లాసంగా కలిగిస్తాయి. దైవ, పుణ్య, సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరుస్తారు. నూతన వస్తువులను కొనుగోలు చేస్తారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేస్తారు. ధనం చేతిలో నిలబడటం కష్టమే.

**కుంభం** : విద్యార్థులకు హడావుడి, తొందరపాటు తగదు. వస్త్ర, బంగారం, వెండి, లోహ వ్యాపారస్తులకు సంతృప్తి కానవస్తుంది. విందు, వేడుకలలో చురుకుగా పాల్గొని అందరిని ఆకర్షిస్తారు. కళ, క్రీడా, సాంకేతిక రంగాలవారికి ప్రోత్సాహకరం. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు, రాత పరీక్షలలో మెళకువ, ఏకాగ్రత అవసరం.

**మీనం** : విందులలో పరిమితి పాటించండి. వాహనం ఇతరులకు ఇచ్చిఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉపాధ్యాయులు పైఅధికారులతో సంభాషించి నపుడు మెళకువ అవసరం.

# సాయిబాబా చిన్న కథలు



### భక్త వాత్సల్యం


బెంగాలు రాష్ట్రంలో మాధవదాసు అనే భక్తుడు ఉండేవాడు. అతని భార్య మరణించింది. మాధవదాసుకు జీవితం మీద విరక్తి కలిగింది. ఆస్తిపాస్తులను అమ్మి వ్యవహారములనన్నింటిని చక్కజేసి, కాషాయ వస్త్రములను ధరించి పూరి క్షేత్రమునకు చేరాడు. పూరి క్షేత్రముల జగన్నాధుని సేవిస్తూ, ఆహర్నిశలూ జగన్నాధ నామస్మరణం చేసేవాడు. పగలంతా దేవాలయాములో గడిపి, రాత్రికి సముద్రపు ఒడ్డుకు చేరి ఇసుక మీద హాయిగా నిద్రించేవాడు. నిరవధిక ఉపాసన వలన అతనిలో వింత తేజస్సు, ఒక శక్తి ఆవిర్భవించినవి. ఒకనాడు జగన్నాధుడు, సోదరి సుభద్రతో సముద్ర తీరానికి వచ్చి, అక్కడ ఒక బంగారు పళ్లెమును పెట్టి అదృశ్యమయినాడు. మాధవ దాసునకు ఈ విషయం తెలియదు. అతడు మైమరచి నామ స్మరణం చేస్తున్నాడు. కొంతసేపటికి కన్నులు తెరిచాడు. ఎదురుగా ఒక పళ్ళెములో రుచికరమైన ఆహార పదార్థములుండడం చూశాడు. అతడు ఏ విధమైన భావము లేకుండా ఆ ఆహారమును భుజించి, మరల ధ్యానములో నిమగ్నుడైనాడు. అతనికి నిర్విచార స్థితి కలిగింది. బంగారు పళ్ళెము మీద అతని దృష్టి పడలేదు. ఆహారము ఏ విధంగా వచ్చినదీ అని కూడా ఆలోచించలేదు. ఆలయంలో జగన్నాధ స్వామికి రాత్రి వేళ మహా భోగమును నివేదన చేయు బంగారు పళ్లెము పూజారులకు కనబడలేదు. ఆలయ అధికారులు బంగారు పళ్లెమును తస్కరించిన దొంగలను వెదుకుటకు బటులను పంపాడు. సముద్రం ఒడ్డున ధ్యానంలో మాధవదాసు ఉన్నాడు.

అతని ముందర బంగారు పళ్ళెము ఉన్నది. భటులు మాధవదాసును బంధించి చెరసాలలో ఉంచారు. ఆరోజు రాత్రి జగన్నాధుడు ఆలయ పూజారికి కలలో కనిపించి, మీరందరూ నాకు ఎంతో భక్తి శ్రద్ధలతో ఆహారమును నివేదన చేస్తారు. కానీ నేను తిన్నానని నన్ను కొట్టి హింసిస్తారు అని పలికి అదృశ్య మయినాడు. పూజారి భయపడుతూ నిద్ర లేచాడు. అతనికి ఇది కలయా! నిజమా! అని తెలియక అచేతనంగా కూర్చున్నాడు. ఆరోజు జరిగిన సంఘటనలను గుర్తుకు తెచ్చుకుని ఆలోచించ సాగాడు. మాధవదాసు మహా భక్తుడు.

అతనికి బంగారు పళ్లెములో ఆహారమును అందించినది జగన్నాధుడు. అనాధలకు నాధుడు జగన్నాధుడే కదా! అని నిర్ణయించి పూజారి, ఆలయ అధికారులకు తెలిపి మాధవదాసును చెరసాల నుండి విడిపించాడు. దీనికి మాధవదాసు పొంగిపోలేదు. దైవానుగ్రహము వలన మాధవదాసు కీర్తి ప్రతిష్ఠలు, భక్తిప్రపత్తులు దశదిశల వ్యాపించినవి.

... సశేషం

## సంకీర్తన



**FINANCE**
ఒన్లీ రిటైర్డ్ పెన్షనర్లకు మాత్రమే
రూ. 30వేల నుండి 3 లక్షల వరకు
విశాఖ నుండి విజయవాడ వరకు
మధ్యలో ఎక్కడైనా సరే స్పాట్ ఫైనాన్స్
(with A/c Pay) చేయబడును.
JK అసోసియేషన్ సర్వీసెస్
Govt. Reg. No. 136/2009 (నో బ్రోకర్స్)
96665 47338

**EDUCATION**
PASS GUARANTEE COACHING
(For Discontinued Candidates)
BA/B.Com/B.Sc
MA/M.Com/M.Sc
Dip/B.Tech/Inter/10th
98662 27171
98487 21118

**బిజినెస్ ఆఫర్**
అవగాహన కోసం రాజమండ్రి వచ్చి రూ.1650లతో కొన్నవారికి, కొనిపించిన వారికి బహులాభాల అపూర్వ అవకాశం.
9393068546, 6300172408

**రేషన్‌కార్డు పడిపోయింది**

యానాం సావిత్రినగర్‌కు చెందిన మల్లాడి వెంకటేశ్వర్లు, S/o. గుర్రయ్యకు చెందిన రేషన్ కార్డు నెం. 006430 పడిపోయినది. ఈ నెల 10వ తేదీన ఆఫీసు పని నిమిత్తం వస్తుండగా మార్గ మధ్యంలో కురసంపేట ప్రధాన రోడ్డు మార్గంలో పడిపోయినది. ఇది ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు తెలియగోరుచున్నాము.

మల్లాడి వెంకటేశ్వర్లు
S/o. గుర్రయ్య
డోర్ నెం. 5-11-089
సావిత్రినగర్
యానాం
సెల్ నెం: 9948583867

**కారు సిబుక్ పడిపోయింది**

ఎం.వి.వి.సత్యనారాయణకు సంబంధించిన PYO4AO 066 నెంబర్ గల కారు సి బుక్కు పడిపోయింది. ఇంజన్ నెంబర్ D4FCHM 504762 చెస్ నెంబర్ MALBM51RLJM 496391 తీసుకువస్తుండగా ఈనెల 10వ తేదీన మార్గమధ్యలో పడిపోయినది. కావున దొరికిన వారు ఈ అడ్రస్ కి అందించగలరు.

ఫోన్ నెంబర్
9573511159

## కరోనా వైరస్‌పై అప్రమత్తంగా ఉండాలి

చోడవరం : ప్రపంచ దేశాలను వణికిస్తూ రోజురోజుకు విస్తరిస్తున్న కరోనా వైరస్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెలుగు ఏపిఎం ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో వెలుగు యానిమేటర్లు, గ్రామైక్య సంఘాల మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వైరస్ ప్రభల కుండా ఉండేలా గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కరోనా విస్తరించ కుండా చేయాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, తదితర వాటిపై ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, వివిధ గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.కరోనా వైరస్ ముందస్తు చర్యలలో భాగంగా మండలంలోని గజపతినగరం గ్రా సచివాలయ సిబ్బంది మంగళవారం ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, తరచూ చేతులు, ముక్కు, నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవడం, చేతులు సబ్బుతో కడుగుకోవడం, జనసమూహాల మధ్య తిరగకుండా ఉండటం, జలుబు, జ్వరం, దగ్గు తదితర లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయ కుండా సమీపంలోని ఆసుపత్రు లలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఆర్ నూకరత్నం, పంచాయతి శెక్రటరీ యశ్వంత్, మహేష్, గణశ్వరమ్మ, వాలెంటీరు నానాజీ, చంద్రిక, దివ్య, పీలా మహేష్, అప్పారావు, ఆశా వర్కర్ బి.లీలా తదితరులు పాల్గొన్నారు.

## క్షయవ్యాధిపై తగిన జాగ్రత్తలు తీసుకోండి



పెద్దాపురం : క్షయవ్యాధి (టిబి) పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కోఆర్డినేటర్ డా.వెంకటేశ్ తెలిపారు. స్థానిక లూథరన్ హైస్కూలులో మంగళ వారం క్షయ నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హెచ్.ఎం.పిలుప్పరాజు మాట్లాడుతూ 2 వారాలకు మించి జ్వరం, కెళ్ళుతో కూడిన దగ్గు ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్ళి పరీక్ష చేయించుకోవాలని, దానికి తగిన మందులు వాడాలని తెలిపారు. 'క్షయ' వ్యాధి సూపర్‌వైజర్ ఎన్.వి.రమణ మాట్లాడుతూ, క్షయ బాధితులు డాట్సు పద్ధతిలో మందులు వాడా లన్నారు. క్షయవ్యాధి రోగులకు నెలకు రూ.500/-లు చొప్పున ఆరునెలల వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని అన్నారు.

అనంతరం క్షయవ్యాధికి సంబంధించి అనేక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రామలింగేశ్వరరావు, రామకృష్ణ, ఆసుపత్రి సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ చిన్నారులకు ఒంటిపూట చదువులకై కృతజ్ఞతలు

- ప్రభుత్వ స్కూల్లో సమానంగా వేసవి సెలవులు ఇవ్వాలని విజ్ఞప్తి
- అంగన్వాడి అసోసియేషన్ (ఏఐటియుసి) జిల్లా అధ్యక్షుడు అప్పలరాజు



అంగన్వాడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అప్పలరాజు

నర్సీపట్నం : నేటి నుండి అంగన్వాడి చిన్నారు లకు రాష్ట్ర కమిషనర్ ఒంటి పూట సెలవులు మంజూరు చేసినందుకు అంగన్వాడీ అసోసియేషన్(ఏఐటియుసి) జిల్లా అధ్యక్షులు ఎం.అప్పలరాజు ధన్యవాదాలు తెలియజేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ తమ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకొని రాష్ట్ర కమిషనర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, 11 గంటల వరకు చిన్నారులను కేంద్రాల్లో ఉంచటం మూడు గంటల వరకు సిబ్బంది కేంద్రాల్లో ఉండటం జిఓ నెంబర్ 7 ద్వారా జూన్ నెల 6వ తేదీ వరకు ఇది అమలులో ఉండటం హర్షణీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు సమానంగా శెలవులు ఇచ్చే విషయమై కమిషనర్ కలిసి వినతి పత్రం ఇస్తామన్నారు. మినీ వర్కర్స్ విషయంలో కొంత వెసులుబాటు ఉండాలని కోరుతున్నామన్నారు.విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని తమ సంఘం (ఏఐటియుసి) పట్టుదలతో ఉందని స్పష్టం చేశామన్నారు.

## ఘనంగా జరిగిన కేజీబీవి పాఠశాల విద్యార్థుల ఫేర్వేల్ పార్టీ



ఫేర్‌వెల్ పార్టీలో విద్యార్థులకు సూచనలిస్తున్న అనంతగిరి ఏటిడబ్ల్యూ సూర్యనారాయణ

అనంతగిరి : అనంగతిరి మండలంలో గల కొత్తూరు పంచాయతీ కొత్తూరుకే జీబివి పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు ఫేర్వెల్ పార్టీ జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అనంతగిరి ఏటి డబ్ల్యు సూర్యనారాయణ మాట్లాడుతూ పరీక్షలు బాగా వ్రాయాలని ఇంతవరకు చదవడం ఒక ఎత్తు పరీక్ష రాయటం ఒక ఎత్తు భయం లేకుండా పరీక్షలు వ్రాయాలని సూచనలు సలహాలు విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శివలింగ పురం హెచ్ ఎమ్ మాట్లాడుతూ విద్యార్థులు భయం లేకుండా పరీక్ష వ్రాయా లని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ పఠాశి వనిత తెలుగు మాస్టారు ఊరుగొండ బుల్లెమ్మ హిందీ ఉపాధ్యాయులు పద్మలత ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు రమాదేవి లెక్కలు ఉపాధ్యాయురాలు కళ్యాణి కాల లక్ష్మి కూడా విజయలక్ష్మి స్వాభి సుశీల బుగిడి భారతి, కపాటి వెంకటలక్ష్మి, పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

### అయ్యన్న యువసేన అధ్యక్షుడు చింతకాయల విజయ్



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న విజయ్

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని అయ్యన్న యువసేన అధ్యక్షులు చింతకాయల విజయ్ డిమాండ్ చేస్తూ బుధవారం నర్సీపట్నం ఆర్డీవో కె.లక్ష్మీశివజ్యోతికు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ నర్సీపట్నం మున్సిపాలిటీలో గల వాలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం, ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తూ ప్రభుత్వం తరపున రావల్సిన సంక్షేమ పథకాలు మా ద్వారా మీకు అందజేయాలి కాబట్టి మేము చెప్పినట్లు వినకపోతే మీకు అందజేయాల్సిన సంక్షేమ పథకాలైన పింఛన్లు నిలిపివేస్తామని ప్రలోభపెడుతున్నారన్నారు. ఈ నెల అందాల్సిన సామాజిక పింఛన్లను పూర్వం ఏ విధంగా ఇచ్చేవారో అదే విధంగా బట్వాడా జరిగేలా చూసి ఎన్నికల్లో నిష్పక్షపాతంగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవడానికి చర్యలు, సచివాలయాల భవనాలకు హైకోర్టు తీర్పు ప్రకారం రంగులు తొలగించకపోవడం, సచివాలయాల భవనాలక ఉన్న వైయస్సార్ పార్టీ అధ్యక్షులు ఫొటోలు ఇప్పటి వరకు తొలగించలేదన్నారు. కావున ఎన్నికల కోడ్ ఉల్లంఘన పరిధిలోకి వర్తిస్తుందని, కావున వెంటనే తగు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గవిరెడ్డి వెంకటరమణ, కొరుప్రోలు శ్రీనివాస్, శ్రీకాంత్, రుత్తల అప్పారావు పాల్గొన్నారు.



చినవాల్తేర్ 21వ వార్డు పరిధిలో గల ఈస్ట్ పాయింట్ కాలనీ లో శ్రీశ్రీశ్రీ సాయిబాబా వారి ఆలయ 27వ వార్షికోత్సవం సందర్భంగా విశేష పూజా కార్యక్రమంలో వైసీపీ నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. స్వామి వారికి ఉదయం నుంచి పలు రకాల అభిషేకాలు, స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామి వారి పూజ అనంతరం తీర్థ ప్రసాధములు వంశీకృష్ణకి ఆలయ అర్చకులు అందజేశారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయం అర్చకులు, అబ్బులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు



యానాం : ప్రపంచ దేశాలను వణికిస్తున్న కరోనా వైరస్ ప్రభావం మరింత వ్యాప్తి చెందకుండా ఉండేందుకు గాను ముందస్తు చర్యల్లో భాగంగా యానం సరిహద్దు ప్రాంతాల్లోని టూరిస్టులు, ఇతరులు యానాం ప్రాంతాల్లోని ప్రవేశించేటప్పుడు వైద్య సిబ్బంది చెక్‌పోస్టు వద్ద పరీక్షలు నిర్వహించిన తరువాత యానాం ప్రాంతంలోకి వచ్చేందుకు చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు పరిపాలన అధికారి శివరాజ్ మీన తెలిపారు. స్థానిక పరిపాలన అధికారి కార్యాలయంలో ఈ మేరకు స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు గాను ముందస్తు చర్యల్లో భాగంగా చెక్ పోస్టులు ఏర్పాటు ఇంటింటా ఆరోగ్య శాఖ సిబ్బంది సర్వే కరపత్రాలు పంపిణీ మైక్ ద్వారా అవగాహనా ప్రచారాలు తదితర చర్యలు తీసుకుంటంనట్లు తెలిపారు. వ్యాధికి సంబంధించిన లక్షణాలు, ఆరోగ్య పరిస్థితి తదితర అంశాలపై విచారణ తదితర చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

19 నుండి మద్యం షాపులు మూసి వేత చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

అదేవిధంగా ఇప్పటికే పాఠశాలలు, కళా శాలలు, సినిమా థియేటర్, స్టేడి యంలో, బార్, మరియు రెస్టారెంట్‌లు, చర్చ్ లు, ప్రభుత్వ అతిథి గృహాలు మూసివేశారు దినికి సంబందించి 24×7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు దీనికి సంబంధించి అధికారులను నియమకం తదితర చర్యలు చేపట్టినట్లు తెలిపారు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## శ్రీ సాయి సుధామయి కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో

### భక్తి సినీ సంగీత గీతాల ఆలాపన



విశాఖపట్నం : శ్రీ సాయి సుధామయి కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రేమ సమాజంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. వ్యవస్థాపకురాలు సోమయాజుల జగదాంబ, సుబ్రహ్మణ్యం దంపతులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తి సినీ సంగీత గీతాలను ఆలపించారు. కార్యక్రమాన్ని సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి, శివ సాయి సంస్థ అధ్యక్షులు వి.ఎం గోపాల్ రావు, శివ కోటి జగదీష్ ,హైదరాబాద్కు చెందిన రాజేంద్ర ప్రసాద్ జ్యోతి ప్రజ్వ లన చేసి ప్రారంభించారు . ఈ సందర్భంగా సన్ మూర్తి మాట్లాడుతూ సంస్థ ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహించి సంగీత ప్రియులను అలరించిన ఈ సంస్థ భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి సరికొత్త కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. వీణ వేణువైన సరిగమ విన్నావా గీతం సంగీత ప్రియులను మెప్పించింది. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎడిసిపి ఖాన్, మల్లికా, గంటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM**
**O.S.1313/2019**

Between:
M/s. Varun Leasing,
Rep.by its Special Power of Attorney Holder,
Polipalli Appala Raju ...Plaintiff
And:
Chellangi Nageswara Rao & Another ...Defendants

**NOTICE**

To,
**D-1) Chellangi Nageswara Rao, S/o Demudu, Hindu, aged 46 years, D.No.22-117-12/2, Police Quarters, Dayal Nagar, B.C.Road, Petrol Bunk back side, Visakhapatnam-530044.**

Please take notice that the above named plaintiff has instituted the above suit against you. You are hereby summoned to appear in the above court in person or through a pleader duly instructed, and the matter stands posted to **13-04-2020 at 10.30 AM** for your appearance, in default of your appearance on that day the suit will be heard and determined in your absence basing on the material available in the Court.

**Tulala Venkateswara Rao,**
**Kurumuji Koteswara Rao,**
**Advocates**
**Kancharapalem,**
**Visakhapatnam-08.**
**Cell No: 9985747149**

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM**
**O.S.1317/2019**

Between:
M/s. Varun Finance,
Rep.by its Special Power of Attorney Holder,
Kondra Anand. ...Plaintiff
And:
Ayinampudi Srinivasa Raju & Another ... Defendants

**NOTICE**

To,
**D-2) Denumkonda Bangaru Raju, S/o.Tata Raju, Hindu, aged 38 years, Vempadu (Village), Nakkapalli (Mandal) Visakhapatnam District-531081.**

Please take notice that the above named plaintiff has instituted the above suit against you. You are hereby summoned to appear in the above court in person or through a pleader duly instructed, and the matter stands posted to **13-04-2020 at 10.30 AM** for your appearance, in default of your appearance on that day the suit will be heard and determined in your absence basing on the material available in the Court.

**Tulala Venkateswara Rao,**
**Kurumuji Koteswara Rao,**
**Advocates**
**Kancharapalem,**
**Visakhapatnam-08.**
**Cell No: 9985747149**

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM**
**O.S.1396/2019**

Between:
M/s. Varun Finance,
Rep.by its Special Power of Attorney Holder,
Kondra Anand. ...Plaintiff
And:
Gorle Soma Sankar Sreedhar & Another ... Defendants

**NOTICE**

To,
**D-2) Nadigotla Mohan Rao, S/o Sundara Rao, Hindu, aged 43 years, D.No.4-20, Yenugubayalu (Village), G.K.Veedhi (Mandal), Darakonda (Post), Visakhapatnam-531105.**

Please take notice that the above named plaintiff has instituted the above suit against you. You are hereby summoned to appear in the above court in person or through a pleader duly instructed, and the matter stands posted to **13-04-2020 at 10.30 AM** for your appearance, in default of your appearance on that day the suit will be heard and determined in your absence basing on the material available in the Court.

**Tulala Venkateswara Rao,**
**Kurumuji Koteswara Rao,**
**Advocates**
**Kancharapalem,**
**Visakhapatnam-08.**
**Cell No: 9985747149**

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM**
**O.S.1340/2019**

Between:
M/s. Varun Finance,
Rep.by its Special Power of Attorney Holder,
Kondra Anand. ...Plaintiff
And:
Mosari Soma Raju & Another ... Defendants

**NOTICE**

To,
**D-2) Saramanda Soma Raju, S/o Appa Rao, Hindu, aged 29 years, D.No.5-102, M.K.Patnam (Post), Rolugunta (Mdl), Narsipatnam, Visakhapatnam (Dist)-531116.**

Please take notice that the above named plaintiff has instituted the above suit against you. You are hereby summoned to appear in the above court in person or through a pleader duly instructed, and the matter stands posted to **13-04-2020 at 10.30 AM** for your appearance, in default of your appearance on that day the suit will be heard and determined in your absence basing on the material available in the Court.

**Tulala Venkateswara Rao,**
**Kurumuji Koteswara Rao,**
**Advocates**
**Kancharapalem,**
**Visakhapatnam-08.**
**Cell No: 9985747149**

# కరోనా వైరస్‌పై ప్రజలలో అవగాహనకు చర్యలు

**కమిషనర్ శేఖర్**



పెద్దాపురం: ప్రపంచ వ్యాప్తంగా ప్రజలను భయభ్రాంతులను చేస్తున్న కరోనా వైరస్‌పై పెద్దాపురం పురపాలక పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగునని కమిషనర్ శేఖర్ తెలిపారు. బుధవారం 'విజయభాను' రిపోర్టర్‌తో మాట్లాడుతూ ప్రభుత్వం 'కరోనా' అరికట్టడానికి ఇచ్చిన ఆదేశాల ప్రకారం మున్సిపల్ పరిధిలో మోడల్ అధికారిని నియమించి, ప్రజలకు అవేర్‌నెస్ క్యాంపులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మురికి కాలువలు, రోడ్లు, మారుమూల ప్రదేశాలలో బ్లీచింగు స్ప్రే చేయడం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక సిబ్బంది ద్వారా మంచినీటి సరఫరా, హోటళ్ళు రోడ్లపై విక్రయిస్తున్న ఆహారపదార్థాలు బండ్లు, ఇతర చిరు తిండ్లు వంటి వ్యాపారులకు కరోనాపై హెచ్చరించినట్లు కమిషనర్ తెలిపారు.

విదేశాల నుండి పెద్దాపురం పట్టణానికి వచ్చిన వారిపై నిఘా పెట్టడం జరిగిందని, పెద్దాపురం ఏరియా హాస్పిటల్‌లో 'కరోనా' కొరకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి ముందుగా తనిఖీలు ప్రారంభించినట్లు కమిషనర్ తెలిపారు. పెద్దాపురం పట్టణ పరిధిలో ప్రస్తుతం కరోనా వ్యాధికి సంబంధించి ఏ విధమైన కేసులు నమోదు కాలేదని, అయితే శానిటరీ సిబ్బంది ఇంటింటికి తిరిగి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ పరిస్థితులలో ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాల శుభ్రతతో పాటు, వ్యక్తిగత శుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి, కరోనా వ్యాధి లక్షణాలు రాకుండా అధికారులతో సహకరించాలని కమిషనర్ శేఖర్ తెలిపారు.

# గ్రామ వాలంటీర్లపై చర్యలు తీసుకోండి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీలోని 1, 2 వార్డులోని వాలంటీర్లు వైయస్సార్ పార్టీకి ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసు కోవాలని 1వ వార్డు స్వతంత్ర అభ్యర్థి మాకిరెడ్డి చిన్నయ్యనాయుడు(అప్పారావు) బుధవారం నర్సీపట్నం ఆర్డీవో కె.లక్ష్మీశివజ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించి ఎన్నికల ప్రచారం చేస్తున్న గ్రామ వాలంటీర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. నామినేషన్ కార్యక్రమంకు హాజరైన 10 మంది వాలంటీర్ల ఫొటోలు, వీడియో క్లిప్పింగ్‌లు అందజేశారు. అలాగే ఓటు వేయకపోతే పింఛన్లు, రేషన్ కార్డులు తొలగిస్తామని బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

# కరోనా వైరస్‌పై అవగాహనకు పోలీస్ టీంలు ఏర్పాటు



కాకినాడ : కరోనా వైరస్ నివారణకు జిల్లా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా ఎస్పీ నయీం అస్మీ తెలిపారు. కరోనా నివారణ అవగాహన కల్పించేందుకు పోలీస్ శాఖలో రెండు టాస్క్ ఫోర్స్ టీంలను ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నారు. ఒక్కొక్క టీంకు ఒక ఎస్సై.10 మంది సిబ్బంది చొప్పున మొత్తం 22 మంది ఉంటారని వీరిలో మహిళా సిబ్బంది కూడా ఉంటారన్నారు. వీరు మెడికల్ సిబ్బందికి సహాయంగా ఉంటారని ఏదైనా ప్రత్యేక పరిస్థితుల్లో ఎవరైనా కరోనా వైరస్ లక్షణాలు కలిగిన వారు వైద్యం చేయించుకోవడానికి ఏమైనా ఇబ్బంది పెట్టినా,మెడికల్ సిబ్బందిపై ఏమైనా దురుసుగా ప్రవర్తించే సందర్భంలో పోలీస్ శాఖకు చెందిన ఈ స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీములు వైద్యసిబ్బందికి సహాయంగా ఉండి రోగికి చికిత్స చేసేందుకు సహకరిస్తారని, అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా అన్ని స్టేషన్లలో కూడా కరోనా వ్యాధికి సంబంధించిన పేషెంట్లను హాస్పిటల్స్‌కు తరలించే సందర్భంలో మెడికల్ సిబ్బందికి అవసరమైతే అందుబాటులో ఉండాలని అన్ని స్టేషన్లకు ఆదేశాలు ఇచ్చామన్నారు.ప్రజలు కూడా ఇది గమనించి అందరూ వైద్య, పోలీస్ సిబ్బందికి, జిల్లా యంత్రాగానికి సహకరించాలని కోరారు.దీనిలో భాగంగా జిల్లా అద్నాన్ నయీం అస్మి సారథ్యంలో జిల్లా పోలీసు కార్యాలయం నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ అవగాహన కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కె.సత్యనారాయణ హాజరై కరోనా నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి విపులంగా వివరించారు. వారికి సూట్ ఎలా ధరించాలి,గ్లౌజ్‌లు ,మాస్కులు ఉపయోగించే విధానం, పేషెంట్లను ఎలా డీల్ చెయ్యాలి అనే విషయాలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో ఓఎస్‌డి ఆరిఫ్ హాఫిజ్, అడిసనల్ సిపి(అడ్మిన్) కరణం కుమార్, ఎం.అంబికా ప్రసాద్, ఎస్.మురళీమోహన్ ,కాకినాడ ఇంచార్జ్ డిఎస్పీ భీమారావు, ఇతరటాస్క్ ఫోర్స్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# టీవీ మెకానిక్‌ల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న టివి, ఎలక్ట్రానిక్ టెన్నిషియన్లు

నర్సీపట్నం : నర్సీపట్నం అల్లూరి సీతారామరాజు టీవీ అండ్ ఎలక్ట్రానిక్ టెక్నీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో టీవీ మెకానిక్ పడుతున్న సమస్యలను నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ దృష్టికి తీసుకు వచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం నుంచి రావల్సిన రాయితీలను అందేలా చూస్తామని, అలాగే సహాయ సహకారాలు అంది స్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ సతీష్, సెక్రెటరీ వాసు, గౌరవ సభ్యులు మూర్తి, శివ, భవాని, అప్పారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## కరోనా వైరస్ వ్యాధి సోకకుండా

# ఉచిత హోమియో మందులు పంపిణీ



విశాఖపట్నం : కరోనా వైరస్ వ్యాధి సోకకుండా ఉచిత హోమియో మందులు పంపిణీ కార్యక్రమం జరిగింది. జీవీఎంసీ 69వ వార్డు హర్జున్ రామా లయం నందు కరోనా వైరస్ దరి చేయకుండా తరిమి కొట్టాలి. ముందస్తుగా వ్యాధి లక్షణాలు రాకుండా హోమియో మందుల ఉచితముగా పంపిణీ కార్యక్రమం జీవీఎంసీ 69 వ వార్డు హర్జున్ జగ్గయ్యపాలం, రామాలయం నందు డాక్టర్ శ్రీనివాసరావు గారు జి. సుబ్బారావు గారు ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు, పిల్లాపాపలతో హాజరై మందులు తీసుకొన్నారు జాగ్రత్తలు అడిగి తెలుసు కున్నారు. ముఖ్యంగా పరిశుభ్రత ఈ వ్యాధి సోకకుండా ఉండడానికి ముఖ్య కారణం డాక్టర్ చెప్పడం జరిగింది.

# మహేలో కరోనా కేసులు నమోదు

## బయలుదేరిన సిఎం మంత్రి మల్లాడి

యానాం : కేంద్రపాలిత ప్రాంతమైన మహే ప్రాంతంలో కరోనా కేసులు నమోదు కావడంతో పుదుచ్చేరి ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఆరోగ్య శాఖా మంత్రి మల్లాడి కృష్ణారావు లు పుదుచ్చేరి నుంచి మహే బయల్దేరి వెళ్లారు ఈ మేరకు మంత్రి మల్లాడి మాట్లాడుతూ పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న పుదుచ్చేరి కారేకల్, మహే, యానం ప్రాంతాల ప్రజలు అధైర్య పడవద్దని వ్యాధి ప్రబలకుండా ఆరోగ్య శాఖ ద్వారా తగు చర్యలు తీసుకునేందుకు సమీక్ష సమావేశం జరిగింది అన్నారు. ప్రజలు ఎలాంటి భయాం దోళనకు గురికావొద్దని, అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని వెల్లడించారు.

కరోనా వ్యాప్తిని నిరోధించేందుకు ఇప్పటికే ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. పాఠశాలలు, సినిమా థియేటర్లు,రెస్టారెంట్లు, పర్యాటక ప్రదేశాలు , మూసివేసిన విషయం తెలిసిందే. తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు.

## వణికిస్తోన్న కరోనా

# కరోనా వైరస్‌పై అవగాహన సదస్సు




మాధవధార : మాధవధార జివియంసి హై స్కూల్‌లో మాధవ ధార రెసిడెన్షియల్ స్వచ్ఛంద సేవా సంఘం ఆధ్వర్యంలో కరోనా వైరస్ పై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రైల్వే విశ్రాంతి వైద్యులు డాక్టర్ బి.బాబూరావు విచ్చేశారు. ఆయన ప్రసంగిస్తూ కరోనా వైరస్ అనే వ్యాధి ప్రపంచ దేశాలను వణికిస్తూ నేడు భారతదేశంలో ప్రవేశించి అన్ని రాష్ట్రాలలో కూడా వ్యాపించడం జరిగింది. ఈ వైరస్ జబ్బు అనేది మొదటి చైనాలో వస్తూ ఇప్పుడు ప్రపంచంలో 167 దేశాలకు వ్యాపించడం జరిగింది. నేడు మన ఆంధ్రాలో కూడా ఈ కరోనా వైరస్ వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అనేక జాగ్రత్తలు తీసుకుంటుంది. ప్రధానంగా ఈ వైరస్ వలన దగ్గు, జలుబు, జ్వరం సంభవించినప్పుడు మీకు దగ్గరలో గల ఆస్పత్రిలో సంప్రదించాలి. చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కొని ముఖానికి చేతులు తగలనీయకుండా మాస్కులు ధరించి, ప్రజలు ఎక్కువగా ఇంటి వద్దనే ఉంటూ నియంత్రణకు తోడ్పడవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో నగర టీటీడి అధికార ప్రతినిధి సనపల పాండురంగారావు, హైస్కూలు ప్రధానోపాధ్యాయులు బ్రహ్మాజి, సైన్స్ ఉపాధ్యాయురాలు హైమ, ఉపాధ్యాయులు శ్యామలరావు పాల్గొని విద్యార్థులు కరోనా వైరస్‌పై అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం జరిగింది.

# ఎన్నికలు ఎప్పుడైనా విజయం వైసీపీదే



అనకాపల్లి ... ఎన్నికలు ఎప్పుడైనా విజయం వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీదేనని ఆ పార్టీ నాయకులు ఆళ్ల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఒక ప్రకటన విడుదల చేసారు. కరోనా వైరస్‌ను విపత్తుగా చూపించడం తగదన్నారు. ఇంతకన్నా దారుణమైన విపత్తులు ఎదుర్కొన్నామని, తెలిపారు. ఇటువంటి విపత్తులు వచ్చినప్పుడు దానికి తగ్గ జాగ్రత్తలు తీసుకోవాలి గాని, ఎన్నికల కమీషన్ అర్ధంతరంగా ఎన్నికలు వాయిదా వేయడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండా, ఎన్నికల నిలిపివేయడం దారణమైన చర్యగా అభివర్ణించారు. ఇప్పటికే 40 శాతం ఏకగ్రీవంగా గెలుపొందిన సంగతిని జీర్ణించుకోలేక తెలుగుదేశం నాయకులు ఎన్నికల కమీషన్‌తో కుమ్మక్కై, రావాల్సిన ఐదువేల కోట్లు ఆపడానికి అభివృద్ధిని అడ్డుకోవడానికి పూనుకున్నారని, అనుమానం వ్యక్తం చేసారు. ఆరువారాల తర్వాత జరిగిన అరవై వారాల తర్వాత జరిగినా రానున్న ఎన్నికలలో మాత్రం ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు కార్పోరేటర్లు, వైసీపీ గెలుపొందడం కాయమన్నారు.

# 82 వ వార్డులో వైసీపీ అభ్యర్ధి సునీత ప్రచారానికి విశేష స్పందన



అనకాపల్లి .... ప్రజాసంక్షేమ పథకాలే వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీని గెలిపిస్తాయని, 82 వ వార్డు వైసిపీ అభ్యర్ధి మందపాటి సునీత అన్నారు. బుధవారం పూడిమడక రోడ్డు ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి పెళ్లి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయి అడిగి తెలుసుకున్నారు. బడికి వెళ్తున్న పిల్లల తల్లిదండ్రులను అమ్మబడి వచ్చింది లేదా అని అడిగి తెలుసుకున్నారు. వ ృద్ధాప్య పెన్షన్లు. వితంతు పెన్షన్లు. రేషన్ కార్డులు లేనివారు దరఖాస్తుచేసుకోవాలని ఆమె కోరారు. అందరూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని ఆమె ఓటర్లను కోరారు. వార్డు పర్యటనలో ఆమెకు అడుగడుగునా హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మందపాటి రామరాజు.పలకరాము. గొన్నవిత్తుల తిన్నారావు. పల్లె అప్పారావు. మల్లె రాంబాబు పల్లె శ్రీనివాస రావు. పల్లె నాగేశ్వరరావు. పిల్ల రమేష. పప్పల రాంబాబుమహిళలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# రొయ్య రైతులు ఆందోళనకు గురికావద్దు

- తక్కువ ధరలకు విక్రయించొద్దు
- మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు డా. వి.వి.కృష్ణమూర్తి

శ్రీకాకుళం: జిల్లాలో రొయ్యలను పండించు రైతులు కరోనా సాకుతో తక్కువ ధరలకు విక్రయించవద్దని మత్స్య శాఖ సంయుక్త సంచాలకులు డా. వి.వి.కృష్ణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కరోనా వైరస్ నేపథ్యంలో రొయ్యలకు ఎక్స్‌పోర్ట్ మార్కెట్ లేదని కుంటిసాకులు చెప్పి, రొయ్యల ధరలను తగ్గించి దళారులు కొనుగోలు చేస్తున్నట్లుగా తమ దృష్టికి వచ్చినట్లు ఆయన చెప్పారు. ఈ విషయమై రొయ్యల రైతులు ఆందోళనకు గురికావద్దని, ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో రొయ్యల ధరలు ప్రతి వారం పెరుగుతుందేగాని తగ్గడంలేదని ఆయన స్పష్టం చేసారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రతి రొయ్య రైతు గ్రహించాలన్నారు.

# 22లోగా బిల్లులు సమర్పించాలి

శ్రీకాకుళం, : బిల్లులను ఈ నెల 22వ తేదీ లోగా సమర్పించాలని ఖజానా శాఖ ఉప సంచాలకులు జి.నిర్మలమ్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్ర ఖజానా శాఖ సంచాలకుల ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. ఈ నెల 19 నుండి 22వ తేదీ వరకు మాత్రమే బిల్లులు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. అందరు డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డీడీవోలు) దీనిని గమనించి బిల్లులు సమర్పించడంలో జాప్యం చేయరాదని కోరారు.

# వైసీపీలోకి పలువురు చేరిక



అనకాపల్లి.... సిద్దిలింగేశ్వర ఆలయ మాజీ చైర్మన్ బొండా శంకరరావు, యాదగిరి బాబ్జీ తన అనుచరులతో బుధవారం యువజన విభాగం అధ్యక్షులు జాజుల రమేష్ ఆద్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ తీర్ధం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాధ్ కండవా కప్పిపార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వేల్పులవీధికి చెందిన శంకరరావు 83 వార్డు కార్పోరేటర్ అభ్యర్ధిగా పోటిచేస్తున్న జాజుల ప్రసన్న లక్ష్మి విజయానికి కృషి చేస్తారని ఈ సందర్భంగా ప్రకటించారు. వార్డు అభివృద్దే ద్యేయంగా అధికార పార్టీలోకి చేరడం జరిగిందన్నారు. శంకరరావుతోపాటు మాజీ కౌన్సిలర్స్ నడిశెట్టి మధు, సకలా గోవింద్, రేబాక మధు, ఉగ్గిన అప్పారావు, గొర్లి చిన్న, కొంకి శ్రీరామ్, బొండా వాసు, ఎరుకువానిపాలెం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# "ఆదిత్యలో ఘనంగా సీనియర్ విద్యార్థుల వీడ్కోలు"
## "ఉత్సాహంగా విద్యార్థుల నృత్యాలు"



గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలల క్యాంపస్ నందు ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విద్యార్దుల వీడ్కోలు పార్టీలతో ప్రాంగణమంతా పండగ వాతావరణం నెలకొంది. గత వారం రోజులుగా వివిధ విభాగాల విద్యార్థులు ఈ కార్యక్రమాలతో ఉత్సాహపూరిత వాతావరణంలో గడుపుతున్నారు.ఇంజనీరింగ్ నాలుగు సంవత్సరాల చదువు పూర్తి చేసుకొని బయటకు వెలుతున్న విద్యార్థులకు వీడ్కోలు చెబుతూ వారి భవిష్యత్తు ఉజ్జ్వలంగా ఉండాలని వారి అనుభవాలను పంచుకొంటూ తృతీయ సంవత్సర విద్యార్థులు చేసే కార్యక్రమం ఈ వీడ్కోలు పార్టీలు ఉపాధ్యాయుల అనుభవాలను, శుభాకాంక్షలను తీసుకొని కళాశాలతో తమకు గల అనుభవాలను తాను నేర్చుకొన్న పాఠాలు గుణపాఠాలు జూనియర్స్‌కు అందించి చక్కటి ఫోటో గ్రాఫ్‌తో మధుర స్మృతులను పదిలపర్చుకుంటూ రోజంతా ఎంతో ఉల్లాసంగా గడిపిన అద్భుత సంఘటనలకు,వారిలో ఉండే సృజనకు,డాన్స్ ,సంగీత సాహిత్య కళలను ప్రదర్శిస్తూ దేనిలోనూ మేము తక్కువ కాదు అని నిరూపించారు.

ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విద్యార్దులు,విభాగాధిపతి ప్రొఫెసర్ వి.సత్యనారాయణ నేతృత్వంలో జరిగిన కార్యక్రమాలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆద్యంతం ఎంతో ఉత్సాహంగా సాగాయి. ఈకార్యక్రమాలలో ప్రిన్సిపాల్ డా.ఎం.శ్రీనివాసరెడ్డి,డీన్స్ ,వివిధ విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# కరోనాపై భాష్యం విద్యార్థుల చైతన్య ర్యాలీ




కాకినాడ: భారతదేశంతో పాటు ప్రపంచంలో చాలా దేశాలను కలవర పెడుతున్న ప్రమాదకరమైన వైరస్ కరోనా గురించి ప్రజలను చైతన్య పరచడానికి స్థానిక శాంతినగర్ భాష్యం స్కూల్ విద్యార్థులు బుధవారం పెద్ద ఎత్తున చైతన్య ర్యాలీ నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డా.ప్రశాంత్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా మహమ్మారిని అందరూ ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. అందుకు సంబంధించి ప్రభుత్వం ప్రచారం చేస్తున్న నిబంధనలు పాటిస్తూ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలను కూడా అప్రమత్తం చేసి వారు కూడా ఆ నిబంధనలు పాటించేలా చూడాలన్నారు.

కరోనాను దేశం నుంచి తరిమికొట్టాలని అందుకు విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా భాష్యం విద్యాసంస్థల జోనల్ ఇంచార్జ్ వి.గోవిందరాజు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక, ఆరోగ్య, వైద్య పరిస్థితులపై తగిన అవగాహన కల్పించడమే ఈ చైతన్య ర్యాలీ యొక్క ఉద్దేశ్యమన్నారు.భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పిలుపుమేరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న భాష్యం విద్యా సంస్థలు అన్నింటిలోను కరోనా పై చైతన్య ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు.అనంతరం ముఖ్యఅతిథి నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డా.ప్రశాంత్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో భాష్యం విద్యా సంస్థలు విద్యార్థిని,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ పి.రామరాజు,రాజశేఖర్,చాంప్స్ ప్రిన్సిపాల్ కే.కళ్యాణి,ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

### ఎలక్షన్ కమిషన్ నిర్ణయాన్ని
# తీవ్రంగా ఖండిస్తున్నా
**సనపల రవీంద్ర భరత్**



విశాఖ సిటీః విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం పాతనగరంలో ఏర్పాటు చేసిన పాత్రికయుల సమావేశంలో వైఎస్సార్సీపీ వాణిజ్య విభాగం దక్షిణ నియోజకవర్గం అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 1995లో టీటీడీ చైర్మన్ ఇప్పటి ఎన్నికల కమిషన్ చైర్మన్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ చౌదరి ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు కోసం అధికార దుర్వినియోనికి పాల్పడి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలుకి వాడేటువంటి అన్ని సామాగ్రిని వాడి ఆయన్ని హంస వాహనం ఎక్కించి విస్ణుప్రియ హోటల్ నుండి అలిపిరి వరకు ఊరేగించి ఆయన స్వామి భక్తి చాటుకున్నారు. అప్పటి నుండి నిన్న జరిగిన ఎన్నికల వాయిదా వరకు అన్ని చంద్రబాబు మెప్పు పొందేలా వ్యవహరించడాన్ని చూస్తే అర్థం అవుతోందని అన్నారు. దానికి ఉదాహరణే నిన్న తెలుగు దేశం శ్రేణులు రమేష్ కుమార్ ఫోటోకి చేసిన పాలాభిషేకం మరియు ఆయన చేసిన ఈ అప్రజాస్వామ్య కార్యక్రమానికి వత్తాసు పలకడం చూస్తుంటే ఎవరికి అయినా సులువుగా అర్థం అవుతుంది అన్నారు. వీటన్నింటినీ ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. కావున ఎన్నికలు ఎప్పుడు పెట్టినా తెలుగు దేశాన్ని ఓడించడం ఖాయం అని దుయ్యబట్టారు . ఈ కార్యక్రమంలో సంకబత్తుల సన్యాసిరావు, బొడ్డేటి ప్రసాద్, ఎమ్ రమేష్, బేవర మహేష్, చొడిపల్లి శివ, రాయితీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# సత్యదేవుని సన్నిధిలో దేవాదాయశాఖ ఏడీసీ రామచంద్రమోహన్ ప్రత్యేక పూజలు



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివార్ని దేవాదాయశాఖ అడిషనల్ కమీషనర్ కె.రామచంద్రమోహన్ శ్రీ స్వామివార్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయనకు ఆలయ మర్యాదలతో ఆలయ సూపరింటెండెంట్ లక్ష్మణస్వామి ఘన స్వాగతం పలికారు.దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వాదములు అందజేయగా సూపరింటెండెంట్ లక్ష్మణస్వామి శ్రీ స్వామివారి శేష వస్త్రమును,ప్రసాదమును అందజేశారు.

# స్వీయ నిర్బంధంలో హీరోయిన్

కోల్‌కతా : భారత్‌లో కరోనా వైరస్ సోకినవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. కరోనా పాజిటివ్‌గా తేలినవారిలో ఎక్కువ మంది విదేశాల నుంచి వచ్చినవారే ఉన్నారు. ఈ నేపథ్యంలో విదేశీ ప్రయాణం ముగించుకుని ఇండియా చేరుకున్న పలువురు స్వీయ నిర్బంధంలో ఉంటున్నారు. తాజాగా బెంగాలీ నటి, త ృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మిమి చక్రవర్తి కూడా ఆ జాబితాలో చేరిపోయారు. తన తాజా చిత్రం బాజి షూటింగ్ కోసం లండన్‌కు వెళ్లిన మిమి చక్రవర్తి మంగళవారం ఇండియా చేరుకున్నారు. కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో థర్మల్ స్క్రీనింగ్ చేయించుకోవడంతోపాటు, కరోనా వైరస్‌కు సంబంధించి ఇతర ఫార్మాలిటీలను కూడా పూర్తి చేశారు. అయినప్పటికీ ముందు జాగ్రత్తగా 7 రోజుల పాటు ఇంట్లో స్వీయ నిర్బంధంలో ఉండనున్నట్టు మిమి చక్రవర్తి ప్రకటించారు. ఈ 7 రోజులు పాటు ఎవరిని కలవకూడదని నిర్ణయం తీసుకున్నారు. 'నేను యూకే నుంచి దుబాయ్ మీదుగా ఇండియాకు వచ్చాను. అందుకే అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాను. ఇంట్లో నన్ను కలవద్దని నా తల్లిదండ్రులకు చెప్పాను. నా తండ్రికి ఇప్పుడు 65 ఏళ్లు. 7 రోజుల పాటు ఇంట్లోనే ఉండాలని నిర్ణయించుకున్నాను. మనం ప్రస్తుతం చాలా కష్ట కాలంలో ఉన్నాం. కానీ తొందరలోనే ఈ పరిస్థితి మారుతుంది. ప్రభుత్వం చెప్పిన విధంగా శుభ్రత, చేతులు కడుక్కోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. భద్రత చర్యల్లో భాగంగా ఇతరులతో దూరంగా మెలగాలి' అని తెలిపారు.

# కరోనా వైరస్ సోకకుండా హోమియో మందులు పంపిణీ
**- కరోనా వైరస్‌పై విద్యార్థులకు అవగాహన చేస్తున్న బొప్పన్న.లక్ష్మణరావు**



నర్సీపట్నం: విశాఖపట్నం జిల్లా కొయ్యూరు మండలం శరభన్నపాలెంలో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో పిల్లలకు ముందుగా కరోనా వైరస్ పై అవగాహన సదస్సులో బేసిక్ హెల్త్ కేర్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ విశాఖపట్నం జిల్లా గౌ.అధ్యక్షుడు బొప్పన. లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని,ఎక్కువ నీటిని,ద్రవ పదార్థాలు తీసుకోవాలని,నోటికి, ముక్కుకు మాస్కులు ధరించాలని,దగ్గినప్పుడు,తుమ్మినప్పుడు సుబ్బుతో చేతులు కడుక్కోవాలని,కరచాలములు చేయరాదని, గుంపులు,గుంపులుగా ఉన్నచోట తిరగరాదని తెలిపారు.అనంతరం బేసిక్ హెల్త్ కేర్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆద్వర్యంలో సుమారు 200 మంది విద్యార్థులకు కరోనా వైరస్ సోకకుండా ఉండేందుకు ఆయుష్ హోమియో పతిలో ఆరెనిక్స్ అల్బమ్ 30 మాత్రలను పంపిణీ చేసారు.

ఈ కార్యక్రమంలో కొయ్యూరు బిహెచ్ ఎంపిఏ మండల అధ్యక్షులు సూర్యనారాయణ. గొలుగొండ మండలం అధ్యక్షులు రామదాసు,వైస్ ప్రెసిడెంట్ వెంకట్రావు,పి. రమణ,బుజ్జి,బాబి మరియు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఎస్.ఎన్.రాజు,ఎస్. సత్యనారాయణ,ఎం. సత్యనారాయణ సహ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కరోనా వైరస్‌పై అవగాహన కలిగి ఉండాలి
## తిమ్మాపురం ఎస్సై విజయబాబు



కాకినాడ రూరల్: ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్‌పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తిమ్మాపురం ఎస్సై జె.విజయ బాబు అన్నారు.

బుధవారం తిమ్మాపురం పోలీస్ స్టేషనులో ఎస్సై విజయబాబు పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ వ్యాధిపై పోలీస్ స్టేషన్ పరిధి14 గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ,కరోనా వ్యాధి నిర్మూలనకు ప్రతిగంటకు ఒకసారి చేతులు శుభ్ర పంచుకోవాలని,తుమ్మిన,దగ్గిన చేతి రుమాలు అడ్డం పెట్టుకోవడం తప్పనిసరిగా చేయాలన్నారు.

సాధ్యమైనంత వరకు వేడి ఆహారం తీసుకోవాలని,బాగా ఉడికించిన మాంసం, గుడ్లు ,తాజాగా కడిగిన కూరగాయలు ఆహారంగా తీసుకోవాలన్నారు.స్టేషన్ పరిధిలో ఉన్న బాటసారులకు మాస్కులు కూడా ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని ఎస్సై విజయబాబు తెలియజేశారు.

# నేటి నుండి విద్యాసంస్థలకు శెలవు
**- కరోనా అరికట్టేందుకు చర్యలు**
**- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్న అధికారులు**

కాకినాడ : ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా మహమ్మారి వ్యాపించకుండా కట్టడి చేయడంతోపాటు ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం మేరకు విద్యాసంస్థలకు శెలవులు ప్రకటిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం, జిల్లా కలెక్టర్ మురళీధర్‌రెడ్డి తెలిపారు.ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.ఈ నెలాఖరు వరకూ విద్యాసంస్థలకు శెలవులు ఉండనున్నాయి. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి అబ్రహం, కలెక్టర్ మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, సాధ్యమైనంతవరకూ ఇంట్లోనే ఉండాలని, ఆరోగ్యరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బయట ఎక్కువగా తిరగవద్దని, జనసమ్మర్ధంగా ఉండే ప్రాంతాల్లో ఉండవద్దన్నారు. తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలని, తుమ్ము, దగ్గు వచ్చినప్పుడు కర్చీఫ్, టిష్యూ పేపర్, లేదా మోచేతిని అడ్డుపెట్టుకోవాలన్నారు.చేతులు ముఖానికి దగ్గరగా పెట్టుకోవద్దన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు విద్యాసంస్థలకు శెలవులు ప్రకటించినట్టు తెలిపారు.

# టెల్కోలపై సుప్రీం తీవ్ర ఆగ్రహం



న్యూఢిల్లీ: టెలికం సంస్థలపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మరోసారి మండిపడింది. ఏజీఆర్ బకాయిల ఛార్జీల చెల్లింపుల విషయంలో ఎలాంటి ఎలాంటి పునఃసమీక్ష ఉండదని తేల్చి చెప్పింది. ఇందుకు అనుమతినిచ్చిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (డీఓటీ)పై సుప్రీంకోర్టు బుధవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏజీఆర్‌ను లెక్కించేందుకు మరోసారి ప్రయత్నించవద్దని స్పష్టం చేసింది. ఈ విషయంలో స్వీయ మదింపు చేసుకున్న కంపెనీలపై కూడా కోర్టు మొట్టికాయలు వేసింది. అసలు వీటిని ఎవరు సమీక్షించమన్నారంటూ జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినట్లుగా పేర్కొంది. గత ఏడాది అక్టోబర్ 24 న ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు నిర్ణయించిన ఏజీఆర్ బకాయిలను స్వీయ అంచనా వేయడం లేదా తిరిగి అంచనా వేయడం ఉండదని స్పష్టం చేసింది. బకాయిలు వసూలుపై ప్రభుత్వ తీరుపై కూడా కోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సుప్రీం పునర్స మీక్షకు గడువు ఇవ్వాలన్న కేంద్రం వాదనను తోసిపుచ్చింది. కోర్టును ప్రభావితం చేయడానికి ప్రతిఒక్కరూ ప్రయత్నిస్తున్నారని, కానీ అది సాధ్యం కాదని తేల్చి చెప్పింది. ఒకవేళ మళ్లీ తిరిగి సమీక్షిస్తే కోర్టు గతంలో తప్పుచేసినట్లు అవుతుందని, ఎట్టి పరిస్థితుల్లో దానికి ఒప్పుకునేది లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బకాయిల చెల్లింపుల పునర్సమీక్షకు అనుమతించిన అధికారుల్ని సహించేది లేదని హెచ్చరించింది. టెలికం కంపెనీలు తప్పనిసరిగా ఏజీఆర్ బకాయిలు చెల్లించాల్సిదేనని గత అక్టోబర్‌లోనే సుప్రీంకోర్టు తీర్పుఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే బకాయిల్ని మళ్లీ సమీక్షించాలంటూ అనేకసార్లు కోర్టును ఆశ్రయించాయి టెలికాం కంపెనీఉ. ఈ క్రమంలో ప్రభుత్వాన్ని సైతం ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలోనే కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. గత నెలలోనూ సుప్రీంకోర్టు సంస్థలపైనా, ప్రభుత్వంపై విరుచుకుపడింది. దీంతో కొన్ని సంస్థలు బకాయిల్లో కొంత మొత్తాన్ని చెల్లించాయి. కానీ మరోసారి కోర్టు సమీక్షిస్తే కొంత మినహాయింపు లభించే అవకాశం ఉందని భావించిన సంస్థలు వేచిచూశాయి. కానీ తాజా మరోసారి సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో బకాయిలే పూర్తిగా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఏజీఆర్ బకాయిల చెల్లింపులు 20 ఏళ్ల పాటు వాయిదాల రూపంలో చెల్లించేందుకు సంస్థలకు వెసులుబాటు కల్పిస్తూ విధివిధానాలను రూపొందించేందుకు అనుమతించాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీకోర్టులో మరో పిటిషన్ దాఖలు చేసింది. ఏజీఆర్? చార్జీల చెల్లింపు వల్ల సంస్థ పనితీరు దెబ్బతింటే ఆ ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతుందని పేర్కొంది. లక్షలాది మంది వినియోగదారుల పైనా ప్రతికూల ప్రభావం ఉంటుందని చెబుతూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

## ఉనికి కోల్పోతామనే చంద్రబాబు కుట్రలు



చిత్తూరు: కరోనా వైరస్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. కరోనాను ఎదుర్కోవడంలో స్థానిక సంస్థలు కీలకమని ఆయన అన్నారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 'అధికారులకు తోడు స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా ఉంటే కరోనాను మరింతగా కట్టడి చేయొచ్చు. టీడీపీ తన ఉనికి కోల్పోతుందని చంద్రబాబు కుట్రలు పన్నారు. ఆయన సీఎంగా ఉన్నప్పుడు రూ.3 లక్షల కోట్లు అప్పులు చేశారు. రూ.60వేల కోట్ల బకాయిలను చెల్లించలేదు.

**బాబు చెప్పినట్లు రమేష్ కుమార్ వింటాడు**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను 9 నెలల్లోనే నెరవేర్చారు. పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వడాన్ని చంద్రబాబు ఓర్చుకోలేకపోతున్నారు. నీరు-చెట్టు పథకం ద్వారా చంద్రబాబు వేలకోట్లు దోచుకున్నారు. ఆయన ఇంకా తాను సీఎంనని భావిస్తున్నారు. సీఎం జగన్ తలచుకుంటే చంద్రబాబుకు ప్రతిపక్ష నేత హోదా కూడా ఉండదు. నిమ్మగడ్డ రమేష్ కుమార్‌తో చంద్రబాబుకు చాలా సంబంధాలు ఉన్నాయి. వాళ్లిద్దరూ ఒకే యూనివర్శిటీలో చదువుకున్నారు. రమేష్ కుమార్‌కు ఉద్యోగం విషయంలో బాబు సాయం చేశారు. ఎన్నికల వాయిదాకు చంద్రబాబే కారణం. ఆయన చెప్పినట్లు రమేష్ కుమార్ వింటాడు. చంద్రబాబు ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకొని డ్రామాలు ఆడుతున్నాడు.

**తక్షణమే ఎన్నికలు నిర్వహించాలి**

నిజాయితీ గల ఐఏఎస్ అధికారి బాబూరావు. మొదట ఆయనను చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జ్‌గా వేశారు. అయితే చంద్రబాబు జోక్యంతో బాబూరావు స్థానంలో సిద్ధార్థ జైన్‌ను నియమించారు. చంద్రబాబుకు సిద్ధార్థ జైన్ నీడలాంటివాడు. పిల్లను ఇచ్చిన మామను వెన్నుపోటు పొడిచిన వ్యక్తి చంద్రబాబు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని చంద్రబాబులా మేం అడ్డదారులు తొక్కలేదు. ఇప్పటికైనా రమేష్ కుమార్ పునరాలోచించుకోవాలి. స్థానిక సంస్థల ఎన్నికలు తక్షణమే నిర్వహించాలి' అని డిమాండ్ చేశారు.

# విస్తారా ఆ విమానాలు బంద్

ముంబై: కోవిడ్-19 (కరోనా వైరస్ ) విజ ృంభిస్తున్న తరుణంలో విమానయాన సంస్థ విస్తారా కీలక నిర్ణయం తీసుకుంది. మార్చి 20 నుంచి మార్చి 31 వరకు తన అంతర్జాతీయ విమాన సర్వీసులను నిలిపి వేస్తున్నట్టు ప్రకటించింది. ముఖ?్యంగా విమాన ప్రయాణికుల ద్వారా ఈ మహమ్మారి తేలికగా ఇతర ప్రాంతాలకు విస్తరిస్తున్న రేపథ్యంలో విస్తారా ఈ నిర్ణయం తీసుకుంది. కరోనావైరస్ పరిస్థితి కారణంగా 2020 మార్చి 20 నుండి 2020 మార్చి 31 వరకు అంతర్జాతీయ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు టాటా సన్స్, సింగపూర్ ఎయిర్‌లైన్స్, జాయింట్ వెంచర్ సంస్థ విస్తారా బుధవారం తెలిపింది.ప్రభావిత విమానాలలో బుక్ చేసుకున్న వినియోగదారులకు పూర్తిగా చార్జీలను తిరిగి చెల్లిస్తామని వెల్లడించింది.

# బెటాలియన్‌లో కరోనాపై అవగాహనా



మధురవాడ : మహా విశాఖ 6వ వార్డు పరిధి బక్కన్నపాలెంలో గల 16వ పోలీస్ బెటాలియన్ లో కమాండెంట్ వి.జగదీష్ కుమార్ ఆధ్వర్యం లో కరోనా వైరస్‌పై అవగాహనా కార్యాక్రమం నిర్వహించారు, ఎవ్వరితోను కరచాలం చెయ్యకూడని, ప్రతి పది నిమిషాలకు చేతులను శుభ్రంగా కడుగుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వలన వైరస్ వ్యాప్తి చెందదని తెలిపారు. ఈ కార్యక్రమానికి యూనిట్ డాక్టర్స్ ఎ. తేజావత్, ఆర్.ప్రమీల, ఎడిడిఎల్ సీఎంటీ పి. శామ్యూల్ జాన్ మరియు అసస్టెంట్ సీఎంపిఎస్ జి. వి. ప్రభాకర్ రావు, పి. లోకనాద బాబు, వి.వి. వి. సత్యనారాయణ , వెంకటేశ్వర రావు మరియు ఏవో నీలకంఠ రావు, ఆర్‌ఐలు కె.తులసి రావు, కె.సమర్పణ రావు, యస్.రాజు మరియు ఆర్‌ఎస్ఐలు, ఎఆర్ఎస్ఐలు సిబ్బంది మరియు మినిస్ట్రియల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# కరోన వైరస్ నిరోధానికి సోషల్ డిస్టెన్స్ పాటించాలి

## డి.ఐ.జి., ఎల్.కె.వి.రంగా రావు



విశాఖపట్నం : విశాఖపట్నం రేంజ్ డి.ఐ.జి., ఎల్.కె.వి.రంగా రావు, కరోనా వైరస్ (కోవిడ్ 19) ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రకటన చేశారు. కరోన వ్యాధి వ్యాప్తిని చిన్న చిన్న వ్యక్తిగత జాగ్రతలు చేపట్టడంతో వ్యాధి ప్రబలకుండా నివారించ వచ్చని అన్నారు.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తరచుగా, చేతులను మోచేతుల వరకు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని, సబ్బు అందుబాటులో లేనప్పుడు సానిటైజరుతో (అల్కోహల్ మిశ్రమము తో కూడిన) శుభ్రపరచు కోవాలని, శుభ్రపరచు కోకుండా కళ్ళ, ముక్కు, నోరులను తాక కాకూడదని, ప్రజా సమూహాల మధ్య తిరుగుతున్నప్పుడు ఎన్-95 మాస్కులు ధరించాలని అన్నారు.

పొడిదగ్గు, జలుబు, జ్వరం వంటివి వచ్చినప్పుడు వెంటనే దగ్గరలో ఉన్న డాక్టరును సంప్రదించాలని, దగ్గు, జలుబు, తుమ్ములు లాంటి అనారోగ్యం ఉన్న వాళ్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ లక్షణాలు ఉన్న వారు రెండు వారాల పాటు ప్రత్యేక గదులలో ఉండి సమూహాల మద్యకు వెళ్లకుండా సరైన చికిత్స తీసుకోవాలని. ప్రభుత్వం నిర్ణయించిన క్వారంటినే కేంద్రాలలో చికిత్స తీసుకోవాలని, అలాగే విదేశాల నుంచి వచ్చిన వారు ఈ క్వారంటినే కేంద్రాలలో తమకు సోకిన వ్యాదిని నయం చేసుకుని తమ ఇళ్లకు వెళ్లాలని సూచించారు. ప్రజలు జన సమ్మర్ధం ఉన్న ప్రదేశాలకు వెళ్ళటం తగ్గించుకోవాలని కాని పక్షంలో నాణ్యమైన మాస్కులు ధరించాలని అన్నారు. మనిషికి మనిషికి దూరం పాటించాలని అభిప్రాయ పడ్డారు.

ప్రజలలో అవగాహన కల్పించడానికి స్థానిక పోలీసు స్టేషన్ లలో ఫ్లెక్సీల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని డి.ఐ.జి., అన్నారు. ప్రజలు సోషల్ మీడియా వదంతులను నమ్మవద్దని భయబ్రాంతులకు గురవవద్దని. పోలీసు కుటుంబాలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఈ రోజు జిల్లా అర్మేడ్ రిజర్వ్ మైదానంలో మరియు డిస్ట్రిక్ట్ పోలీసు ఆఫీసు మొదలైన వాటిలో సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డి.ఐ.జి, అన్నారు.

## కాపు ఉద్యమంలో జరిగిన కేసుల ఎత్తివేత

అమరావతి: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణానంతరం జరిగిన ఘటనల్లో నమోదైన కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసింది. ఆ సమయంలో ముఖ్యంగా రిలయన్స్ దుకాణాల పై దాడులకు సంబంధించి నమోదైన కేసులను ఎత్తివేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర హెూంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా తుని రైలు దహనం ఘటనలో నమోదైన కేసులతో పాటు కాపు ఉద్యమంలో చెలరేగిన హింస వల్ల నమోదైన 51 కేసులనూ ఎత్తివేస్తున్నట్లు హెూంశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది..

## శ్రీ శారదా పీఠంలో ఘనంగా ప్రారంభమైన

# విషజ్వరపీడ హర, అమృత పాశుపత యాగం

- ఏప్రిల్ 2 నుంచి మే 10 వరకు దేశానికి కాలసర్పదోషం నివారణ కోసం
- యోగవాశిష్టంలోని బీజాక్షరాలను సంపుటి చేసి యాగం న్విహణ
- శారదాపీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి
- పీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి



పెందుర్తి : దేశ ప్రజలు, ప్రపంచం యావత్తు ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని కాంక్షిస్తూ శ్రీ శారదా పీఠంలో విషజ్వరపీడ హరయాగం, అమృత పాశుపత యాగం నిర్వహిస్తున్నట్లు విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి, పీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి వార్లు పేర్కొన్నారు. బుధవారం ఘనంగా ఈ యాగం ప్రారంభమైంది. విశాఖ శ్రీ శారదాపీఠం ఆధ్వర్యంలో ఈ మహత్తర కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు శారదా పీఠం శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి మాట్లాడుతూ విషజ్వరపీడ హర, అమృత పాశుపత యాగం 11 రోజుల పాటు ఋత్వికుల ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం భారత దేశ గ్రహ మైత్రేయి సరిగా లేనందున ఇటువంటి విపత్కర పరిస్థితులు ఎదురవుతున్నాయని అన్నారు. భారతదేశ జన్మరాశి ధనురాశిలో గురుడు, కుజుడు, కేతువు మూడు గ్రహాల కలయిక, రెండు దుష్టగ్రహాలతో గురు గ్రహ వీక్షణ వల్ల దేశంలో ఆరోగ్య పరమైన సమస్యలు సంభవిస్తాయని జ్యోతిష్య శాస్త్రంలో స్పష్టంగా ఉంది. మార్చి 23 నుంచి కుజుడు మకర రాశిలో శనితో కలిసి ఉండటం వల్ల ఇటువంటి పరిస్థితులు సంభవిస్తున్నాయని అన్నారు. ఏప్రిల్ 2 నుంచి మే 10 వరకు దేశానికి కాలసర్పదోషం ఉంది. ఈ పరిస్థితుల్లో దైవానుగ్రహ కార్యక్రమాలతో విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని అన్నారు. విషజ్వరపీడ హర, అమృత పాశుపత యాగం 11 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఔదుంబర (మేడి) వృక్ష సమిధలు, సుగంధ ద్రవ్యాలు, వనమూలికలు, గోమయంతో చేసిన పిడకలు ఈ యాగంలో ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ఈ యాగధూళి ప్రజలకు ఆరోగ్యాన్ని చేకూరుస్తుందని తెలిపారు. ఋగ్వేదం, అథర్వణ వేదాల్లోని ఆరోగ్య మంత్రాలు, యోగవాశిష్టంలోని బీజాక్షరాలను సంపుటి చేసి ఋత్వికులు యాగం నిర్వహిస్తారన్నారు.

దేశం సుభిక్షంగా, ప్రజలంతా ఆరోగ్యంగా సుఖసంతోషాలతో ఉండాలనే ఆకాంక్షతో పూజ్య స్వామీజీ శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర స్వామి ఆశీస్సులుతో యాగం నిర్వహిస్తున్నట్లు పీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి తెలిపారు. భక్తమహాశయులందరూ ఈ యాగ కార్యక్రమంలో పాల్గొని దేశ ప్రజలు, ప్రపంచం యావత్తు ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని సూచించారు.

# అమ్మవారి ఆశీస్సులతో ప్రజాసేవకే పరిమితమౌతా

- బర్మా క్యాంప్‌లో 5 వేల మందికి భారీ అన్న సమారాధన
- సనాతన ధర్మానికి ప్రతీకలు గ్రామదేవత పండగలు
- 48వ వార్డు స్వతంత్ర అభ్యర్థి బొడ్డేటి అనూరాధ



కాళికా వేషధారిణిలో ఉన్న కళాకారిణిని అభినందిస్తున్న 48వ వార్డు స్వతంత్ర అభ్యర్థి బొడ్డేటి అనూరాధ



కంచరపాలెం: గ్రామంలో ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండే విధంగా గ్రామ దేవతల పండగలు నిర్వహిస్తుండడం సనాతన ధర్మానికి ప్రతీకలని గ్రేటర్ విశాఖ 48వ వార్డు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయుచున్న బొడ్డేటి అనూరాధ తెలియజేశారు. ఇందులో భాగంగా జైభారత్ నగర్ బర్మా క్యాంప్‌లో కొలువై ఉన్న నూకాంబికా అమ్మవారి కొత్త అమ్మవాస్య జాతర మహెూత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం అమ్మవారి భక్తులకు బొడ్డేటి అనూరాధ, జై భారత్ నగర్ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన 48వ వార్డు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయుచున్న బొడ్డేటి అనూరాధ నూకాంబికా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 48వ వార్డు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయుచున్న బొడ్డేటి అనూరాధ మాట్లాడుతూ అమ్మదయ ఉంటే అన్నీ ఉన్నట్లే అని నమ్మి అమ్మవారి సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. అమ్మ దయతో భవిష్యత్తులో మరిన్ని ప్రజా సంక్షేమ సేవా కార్యక్రమాలలో పాల్గొని వార్డు ప్రజలకు తన సేవ, సహాయ సహకారాలు అందించగలనని ఆమె హామీ ఇచ్చారు. అమ్మ కృపా కటాక్షాలతో వార్డు ప్రజలంతా సుఖసంతోషాలతో మెలగాలని ఆమె అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. సుమారు 5000 మంది భక్తులు ఈ అన్నసమారాధన కార్యక్రమలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జై భారత్ నగర్ గ్రామ అధ్యక్షుడు, పీసీసీ మాజీ సంయుక్త కార్యదర్శి డా. బొగ్గు శ్రీను, ఆల్‌వెల్ గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మన్ బొడ్డేటి నాగేశ్వరరావు (నాగు), కాంగ్రేగుల శివ అప్పారావు, పిల్లి రాజు, బిజెపి కృష్ణ, పుక్కళ్ల ప్రసాద్ మరియు బొగ్గు శ్రీను మిత్రమండలి సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# ప్రచారపర్వంలో వైకాపా అభ్యర్థి వావిళ్లపల్లి ప్రసాద్ సతీమణి నిర్మల

## పేద మహిళలకు బహువిధ సేవా కార్యక్రమాలు

## ఉచిత వైద్య సేవలు, అవగాహన తరగతులు




మాధవధార: పేద మహిళలకు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వావిళ్ళపల్లి ప్రసాద్ సతీమణి, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ నిర్మల చేస్తున్న సేవలు ఎనలేనివని అన్నారు. 50వ వార్డులో పేద మహిళలకు ఉచిత వైద్య సేవలు నిర్వహించి, అవగాహన సదస్సులు నిర్వహించే వారని అన్నారు. ఈ సందర్భంగా మహిళలు 50వ వార్డు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వావిళ్ళపల్లి ప్రసాద్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

ఆయనను గెలిపించుకోవడం వల్ల వార్డులో మరిన్ని సేవలు పొందవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 50వ వార్డు అధ్యక్షురాలు పప్పల సునీత, ఎం. లక్ష్మి , రాధా, అధిక సంఖ్యలో మహిళలు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఇటలీ రాజధాని రోమ్‌లో చిక్కుకున్న

# తెలుగు వారిని భారత్‌కు రప్పించండి

- విశాఖ యంపీ ఎంవీవీ సత్యనారాయణ వినతి
- విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జై శంకర్‌తో భేటీ



ఢిల్లీ : ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సుమారు 70 మందిని తిరిగి స్వదేశానికి తిరిగి రప్పించాలని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనా రాయణ కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖా మంత్రి జై శంకర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఢిల్లీ లో ఆయన కార్యాలయానికి చేరుకుని వినతిపత్రాన్ని సమర్పించారు.

ఈ సంధర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ ఇటలీ రాజధాని రోమ్ లో చిక్కుకున్న 70 మంది తెలుగు వారిని స్వస్థలాలకు రప్పించాలని కోరామన్నారు. ఈ మేరకు ఓ విజ్ఞాపన పత్రాన్ని జై శంకర్ కు అందజేశామన్నారు. కరోన వైరస్ (కోవిడ్-19) ప్రస్తుతం విజృంభిస్తున్న తరుణంలో రెండు తెలుగు రాష్ట్రాల కు చెందిన 70 మంది అక్కడ చిక్కుకున్నారని. ఈ నేపథ్యంలో వారి తల్లి తండ్రులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రముఖంగా అక్కడ విశాఖనగరానికి చెందిన ఇద్దరు ఆ సమూహంలో ఉన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. భాదితుల తల్లితండ్రులు తనను కలిసి , ఈ విషయం పై ఆవేదన వెలిబుచ్చి, తగు న్యాయం చేయాలని కోరారన్నారు. ఈ క్రమంలో రోమ్ నగర ఎయిర్పోర్టు లో సహాయార్థులై వేచి ఉన్న వారిని, తిరిగి రప్పించేందుకు చొరవ చూపాలని విదేశీ వ్యవహారాల శాఖా మంత్రిని కలిసి విన్నవించామన్నారు. స్పందించిన ఆ శాఖా మంత్రి ఆ దేశ ఎంబసీ తో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకుని, తగు న్యాయం చేసేటట్లు ప్రయత్నం చేస్తామని హామీనిచ్చామన్నారు.

# కారులో రూ. 10.50 లక్షలు స్వాధీనం



భీమునిపట్నం : ఎన్నికల నేపథ్యంలో భీమిలి మండలం తగరపువలస చెక్ పోస్టు వద్ద నిర్వహించిన వాహన తనిఖీలలో రూ.10.50 లక్షలు పట్టుబడ్డాయని భీమిలీ సి. ఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన ఇచ్చిన వివరాల ప్రకారం శ్రీకాకుళం నుండి 8 మంది ఉపాధ్యాయులు వస్తున్న ఓ కారును ఎస్. ఐ సంతోషకుమార్, ఉప తహసీల్దార్ త్రినాధ్ సిబ్బంది తనిఖీ చేసినట్లు చెప్పారు.

కాగా ఆ కారులో రూ. 10.50 లక్షలు లభ్యమయినట్లు చెప్పారు. ఆ డబ్బుకు ఎలాంటి ఆధారాలు, రశీదులు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నామని అన్నారు. కాపులుప్పాడ ప్రాంతంలో భూములు కొనుగోలు చేసేందుకు అడ్వాన్సుగా ఈ మొత్తాన్ని తీసుకెళ్తున్నట్లు వారు చెప్పారనీ అన్నారు. ఆధారాలు చూపితే తిరిగిస్తామని లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామనీ తెలిపారు.

VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com